సీమవార్త

రాయల సీమ

అనంతపురం జిల్లా/ సత్యసాయి (పుట్టపర్తి) జిల్లా

పేజీలు : 4

శనివారం 14 నవంబర్ 2026

ప్రతి పంచాయతీ లో.....జనసేన జెండా ఎగరాలి..!!

....గ్రామ పంచాయతీ ఎన్నికలకు జనసేన సమాయత్తం

....పుట్టపర్తిలో నియోజకవర్గ స్థాయి భారీ సమావేశంలి

...సర్పంచ్, వార్డు బరిలో బలమైన అభ్యర్థులే.. ప్రతి గ్రామంలో గెలుపే లక్ష్యం

....ప్రతి పంచాయతీలో జనసేన జెండా ఎగరాలి - నాయకుల పిలుపు

పుట్టపర్తి, నవంబర్ 13 (సీమవార్త బ్యూరో) :



రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పుట్టపర్తి నియోజకవర్గంలో సత్తా చాటేందుకు జనసేన పార్టీ ఎన్నికల సమరానికి సమాయత్తమైంది. జిల్లా నాయకులు నవీన్ నిచ్చల్ ఆదేశాల మేరకు శుక్రవారం పుట్టపర్తిలోని సాయి ఆరామంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్తల అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి భారీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జనసేన తరఫున సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయాలనే ఆసక్తి కలిగిన ఆశావహ అభ్యర్థులు, వారి మద్దతుదారులు, పార్టీ నాయకులు, జనసైనికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశం ప్రారంభం నుంచే జనసైనికుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. ఈ సందర్భంగా పార్టీ అనుసరించాల్సిన కార్యాచరణ, అభ్యర్థుల ఎంపికలో అనుసరించాల్సిన విధానం, గ్రామాల వారీగా పార్టీ పరిస్థితి, క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతు కూడగట్టడం, ఎన్నికల సమన్వయం వంటి అంశాలపై నాయకులు విస్తృతంగా చర్చించారు. ప్రతి గ్రామ పంచాయతీలో జనసేన బలాన్ని చాటేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలపై అవగాహన కలిగి, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండే నాయకులను గుర్తించి ఎన్నికల బరిలో నిలిపేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్తలు పత్తి చంద్రశేఖర్, పూల శివప్రసాద్, గడ్డం వెంకటేష్ నాయక్, పుట్టపర్తి మున్సిపల్ చైర్మన్ మేకల ఈశ్వర్, నియోజకవర్గ నాయకులు తోట్ల గంగాధర్, అల్లాడి జయరాం, మీనా గణేష్, తిరుపతేంద్ర, కరుణాకర్, సుబ్బరాము, గూడా సోము, సర్పంచ్ ఆశావహులు, మండల, నియోజకవర్గ జనసేన నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ వారసత్వానికి చరమగీతం పాడాలి..!!

.... సామాన్యులకు రాజ్యాధికారం దక్కాలి

....రాజకీయ వారసత్వ కుటుంబాలను ప్రోత్సహించవద్దు.

....ప్రజాసేవ ముసుగులో ఆస్తులు కూడబెట్టే స్వార్థపరులను తరిమికొట్టండి.

...నిస్వార్థ ప్రజాసేవకులకే రాజకీయ అధికారం అప్పగించండి.

....సామాన్య ప్రజలు రాజ్యాధికారం సాధించడమే ఓటు హక్కు అసలైన లక్ష్యం.

....ఓటర్ల మహాశయులారా.. ఒక్కసారి ఆలోచించండిలి.



చెన్నేకొత్తపల్లి నవంబర్ 13 (సీమ వార్త):

ప్రజాస్వామ్యం అంటే కొన్ని రాజకీయ కుటుంబాల సొంత ఆస్తి కాదని , ప్రజల ఓట్లతో గెలిచి, ప్రజలనే పాలించే అధికారం కొందరు కుటుంబాల చేతుల్లో తరతరాలుగా కొనసాగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమూగ వున్నదని . రాజకీయ పదవులు వారసత్వంగా సంక్రమించే ఆస్తులు కావని. అవి ప్రజలు ఇచ్చే బాధ్యతాయుతమైన పదవులని అలాంటి ప్రజాసేవ పేరుతో రాజకీయాల్లోకి వచ్చి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకునే స్వార్థపరుల పట్ల ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని , ఎన్నికల సమయంలో చేతులు జోడించి ఓట్లు అడిగి, గెలిచిన తర్వాత ప్రజలను పట్టించుకోని నాయకులకు ప్రజలే తగిన గుణపాఠం చెప్పాలని, రాజకీయ పార్టీలు కూడా కుటుంబ వారసత్వాలకు, ధనబలానికి, కులబలానికి ప్రాధాన్యత ఇవ్వకుండా సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన నిజాయితీపరులకు, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడే నాయకులకు అవకాశాలు కల్పించాలని ఓటు హక్కు అంటే కేవలం ప్రభుత్వాలను ఎన్నుకోవడం కాదు.. పాలించే అధికారం సామాన్య ప్రజలకు కూడా దక్కేలా చేయడం. రాజ్యాంగం కల్పించిన రాజకీయ సమానత్వాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఓటరుపై ఉంది. కులం, మతం, డబ్బు, మద్యం, రాజకీయ పలుకుబడి వంటి ప్రలోభాలకు లొంగకుండా అభ్యర్థుల వ్యక్తిత్వాన్ని, ప్రజాసేవా చరిత్రను పరిశీలించి ఓటు వేయాలని ఒకరోజు ఇచ్చే డబ్బు, బిర్యానీ, మద్యం కోసం ఐదేళ్ల భవిష్యత్తును తాకట్టు పెట్టుకోవద్దని గ్రామాల అభివృద్ధి, పేదల సంక్షేమం, విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, ఉపాధి వంటి అంశాలపై స్పష్టమైన ఆలోచన ఉన్న నాయకులనే ఎన్నుకోవాల్సిన అవసరం ఎంతైనా వున్నదని. రాజకీయాలు కొందరి కుటుంబాల గుప్పిట్లోనే ఉండాలా? సామాన్య ప్రజలు రాజకీయ నాయకులుగా ఎదగకూడదా? ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికీ సమాన రాజకీయ - మిగతా3లో

'కియా' విస్తరణ తో పుష్కలంగా అభివృద్ధి, ఉద్యోగాలు!!

....రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండ నవంబర్ 13 సీమ వార్త.



విశాఖ సీఐఐ సమ్మిట్ సందర్భంగా కూటమి ప్రభుత్వంతో కియా ప్లాంట్ విస్తరణ ఒప్పందం చేసుకోవడంపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. కార్ల పరిశ్రమ విస్తరణ ఒప్పందంతో పెనుకొండ పట్టణం సహా చుట్ట పక్కలప్రాంతాలు అభివృద్ధి చెందడమే కాకుండా 12 వేల మందికి పైగా యువతకు కొత్తగా ఉద్యోగాలు లభించనున్నాయన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖలో జరుగుతున్న విశాఖ సీఐఐ సమ్మిట్ - 2026కు పెట్టుబడిదారుల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబునాయుడు సమర్థ నాయకత్వంపై ఉన్న నమ్మకంతో దేశ, విదేశాలకు చెందిన పెట్టుబడిదారులు ఏపీలో పరిశ్రమల స్థాపనకు పోటీపడుతున్నారన్నారు. విశాఖ సమ్మిట్ సందర్భంగా తొలిరోజు రూ.5.85 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. రెండో రోజూ కూడా ప్రఖ్యాత గాంచిన సంస్థలు కూటమి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకున్నాయన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యం రూ.11 వేల లక్షల కోట్ల కంటే అదనంగా పెట్టుబడులు వస్తున్నాయన్నారు.ముఖ్యంగా, పెనుకొండలో ఉన్న కియా కార్ల పరిశ్రమ విస్తరణకు ఆ సంస్థ యాజమాన్యం ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. రూ.17 వేల కోట్లతో రెండు లక్షల కార్ల ఉత్పత్తులే లక్ష్యంగా కియా యాజమాన్యం ఒప్పందం చేసుకుందన్నారు. ఈ ఒప్పందంతో కొత్తగా 12 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. కియా పరిశ్రమ రాకతో పెనుకొండ రూపురేఖలే మారిపోయాయన్నారు. ఇప్పుడా ప్లాంట్ విస్తరణ పనులు కూడా ప్రారంభమైతే..ఆ సంస్థ నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ మరింతగా వచ్చే అవకాశముందన్నారు. దీనివల్ల పెనుకొండ పట్టణంతో పాటు చుట్ట పక్కల గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు వీలుకలుగుతుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో కియా పరిశ్రమ ఏర్పాటయిందని, 13 వేల మందికి పైగా ఉద్యోగాలు లభించాయన్నారు. ఇపుడు కొత్త ఒప్పందం కారణంలో మరో 12 వేల మందికి ఉద్యోగావకాశాలు లభించనుండడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. కియా విస్తరణ పనులకు పచ్చజెండా ఊపిన సీఎం చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కు, మంత్రి నారా లోకేశ్, కార్ల పరిశ్రమ యాజమాన్యానికి మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు.

జిల్లాలో....టన్ను ఇసుక ధర రూ.158/- గా ఖరారు..!!

.... జిల్లా స్థాయి ఇసుక కమిటీ నిర్ణయం

....చిత్రావతి రిజర్వాయర్‌లో నూతన ఇసుక బ్లాకులకు గ్రీన్ సిగ్నల్

....సామాన్యులకు ఉచిత ఇసుక.. ప్రభుత్వ పనులకు చిత్రావతి నుండి సరఫరా

....జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ,జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్



పుట్టపర్తి నవంబర్ 13: సిమవార్త.

శుక్రవారం కలెక్టరేట్ లోని మినీ కన్ఫారెన్స్ హాల్ నందు శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్,జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించబడింది. జిల్లాలో ఇసుక లభ్యత, నూతన డీ-సిల్టేషన్ పాయింట్ల కేటాయింపు, ఇసుక ధరల నిర్ణయం మరియు అక్రమ ఇసుక రవాణా నియంత్రణ తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి పలు కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగింది.జిల్లాలో జీవనదులు లేనందున, 83, ఒకటవ,రెండవ మూడవ ఆర్డర్ వాగుల ద్వారా స్థానిక గృహ నిర్మాణ అవసరాలకు ప్రజలకు ఉచితంగా ఇసుక అందుబాటులో ఉంచబడింది.వాణిజ్య మరియు ప్రభుత్వ బల్క్ పనుల కోసం తాడిమర్రి మండలం, సి.సి. రేవు గ్రామంలోని చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి డీ-సిల్టేషన్ ద్వారా ఇసుకను - మిగతా3లో

విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

డాక్టర్ గవాస్కర్ రెడ్డి



పులివెందుల నవంబర్ 13 (సీమ వార్త):విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని, దోమల బెడద నుంచి రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ గవాస్కర్ రెడ్డి పేర్కొన్నారు. తొండూరులోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాల మరియు బీసీ బాలుర వసతి గృహం విద్యార్థులకు ఆయన దోమతెరలను పంపిణీ చేశారు. ?ఈ సందర్భంగా డాక్టర్ గవాస్కర్ రెడ్డి మాట్లాడుతూ దోమకాటు వల్ల వచ్చే వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు ప్రభుత్వ హాస్టళ్లలోని విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ రాత్రి వేళల్లో తప్పనిసరిగా దోమతెరలు వాడాలని సూచించారు. దోమకాటు వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి తీవ్రమైన జ్వరాలు వస్తాయని చెప్పారు. డెంగ్యూ సోకితే రక్తంలో ప్లేట్‌లెట్స్ వేగంగా తగ్గి ప్రాణాపాయం ఏర్పడే ప్రమాదం ఉందని, చికున్‌గున్యా వల్ల నెలల తరబడి కీళ్ల నొప్పులు ఇబ్బంది పెడతాయని వివరించారు. ?సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య మాట్లాడుతూ... నిద్రించేటప్పుడు తప్పనిసరిగా దోమతెరలు వాడాలని, కాళ్లు, చేతులు పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించాలని సూచించారు. నిల్వ నీటిలోనే దోమలు వృద్ధి చెందుతాయి కాబట్టి హాస్టల్, పాఠశాల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి మల్లయ్య మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు భోజనానికి ముందు, మల విసర్జన అనంతరం తప్పనిసరిగా చేతులను సబ్బుతో కడుక్కొని శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు నాగేశ్వరి, మంజుల, ఆశా కార్యకర్త కుమారి, హాస్టల్ ఇంచార్జ్ ప్రిన్సిపల్ మెహరూన్, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీదేవి, హాస్టల్ ఆరోగ్య కార్యకర్త సుజాత తదితరులు పాల్గొన్నారు.

లోటస్ స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం

చిన్నారుల సందడితో కళకళలాడిన పాఠశాల





తాడిపత్రి, నవంబర్ 13 వార్త: తాడిపత్రి పట్టణంలోని సంజీవ్ నగర్ లో గల ది లోటస్ ఇంటర్నేషనల్ ప్లే ఓ ప్రీ స్కూల్ నందు శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని జరుపుకుంటామని, పిల్లలంటే చాచా నెహ్రూకు ఎంతో ఇష్టమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ రమ్య , అకడమిక్ డైరెక్టర్ సురేష్ , అడ్మిన్ / ప్రెసిడెంట్ డైరెక్టర్ బాబు హాజరయ్యారు. చిన్నారులు ఆటలు, పాటలు, డ్యాన్స్ లతో సందడి చేశారు. ఉపాధ్యాయులు కూడా పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వారిని అలరించారు.పిల్లలకు బహుమతులు, చాక్లెట్లు అందజేసి, బాలల దినోత్సవ విశిష్టతను వివరించారు. చిన్నారులే భవిష్యత్తుకు పునాది అని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే తమ లక్ష్యమని డైరెక్టర్లు తెలిపారు. పిల్లలు చాలా సంతోషంగా గడిపారని, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణకు నైట్ బ్లడ్ సర్వే.



చిలమత్తూరు నవంబర్ 13 సీమ వార్త చేనేపల్లి, కొడికొండ గ్రామాల్లో సర్వే నిర్వహించిన వైద్య సిబ్బంది ఫైలేరియా (బోదకాలు) వ్యాధి నిర్మూలనలో భాగంగా మైక్రో ఫైలేరియా సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం చేనేపల్లి, కొడికొండ గ్రామాలలో ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి నైట్ బ్లడ్ స్మీయర్ శాంపిల్స్ సేకరించారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఫైలేరియా వ్యాధి క్యూలెక్స్ దోమ కాటు ద్వారా వ్యాపిస్తుందని, రాత్రి సమయంలో రక్త పరీక్ష ద్వారా మాత్రమే వ్యాధిని గుర్తించవచ్చని ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం మలేరియా ఉప విభాగం సిబ్బంది, ఎం ఎల్ హెచ్ పి లు ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్ఎం లు ఆశాలు, హెల్త్ సూపర్ వైజర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఎస్ జి ఎఫ్ హాకీ పోటీలకు జీవనజ్యోతి విద్యార్థిని ఎంపిక .

హెడ్మాస్టర్ మిస్టర్స్ సిస్టర్ సుజాత.

ధర్మవరం నవంబర్ 13 సీమ వార్త ;అక్టోబర్ నెల 30వ తేదీన అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి అండర్ 19 హాకీ జట్టుకు పి. వరలక్ష్మి ఎంపికైందని పాఠశాల హెడ్ మిస్టర్స్ సిస్టర్ సుజాత తెలిపారు. ఎంపికైన విద్యార్థిని నవంబర్ నెల 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు పులివెందుల లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థినిని పాఠశాల హెడ్ మిస్టర్స్ సిస్టర్ సుజాత ,ఉపాధ్యాయ, ఉపాధ్యాయుని బృందం తల్లిదండ్రులు తోటి విద్యార్థులు అభినందించారు.

టీడీపీ కార్యకర్తకు నివాళులు.



పెనుకొండ నవంబర్ 13 సీమవార్త. మండలంలోని మునిమడుగు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త వడ్డే నరేష్ శుక్రవారం మరణించారు. జడ్పీటీసీ యశోదకేశవయ్య, ఎంపీపీ దండు మమత ఈశ్వరప్రసాద్,ఎంపీటీసీ లక్ష్మీదేవిరవీంద్రరెడ్డి, మాజీ సర్పంచ్ మంచునీళ్ల సూర్యనారాణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించి, అంత్యక్రియలు కు రూ. 15వేలు ఆర్థిక సహాయం అందజేశారు.కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నారాయణ స్వామి, సూర్య నారాయణరెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, మాజీ డీలర్ భాస్కర్ రెడ్డి, రమేష్ తదితరులు నాయకులు ఉన్నారు.

హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బిరహిత సమాజం నిర్మిద్దాం


- ప్రివెన్షన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్



పులివెందుల నవంబర్ 13 (సీమ వార్త):హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి, వ్యాధుల త్రిపుల్ ఎలిమినేషన్ లక్ష్య సాధనలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా రక్త పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయినట్లయితే ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వైద్యులను సంప్రదించి పూర్తిస్థాయిలో చికిత్స, మందులు తీసుకోవాలని ప్రివెన్షన్ ఆఫీసర్ ఆనంద్ కుమార్ సూచించారు. ఈ సందర్భంగా పులివెందుల పట్టణం లోని మిట్ట మల్లేశ్వర స్వామి కళ్యాణ మండపం ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యాధులను ముందుగానే గుర్తించడం ద్వారా ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని, ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు క్రమం తప్పకుండా అవసరమైన పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. అదేవిధంగా సుఖ వ్యాధులపై అవగాహన కలిగి ఉండటంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణకు సంబంధించిన పలు ముఖ్యమైన ఆరోగ్య సూచనలు వివరించారు. ప్రభుత్వ ఆరోగ్య సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని, హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్-బి ల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు,సీడీఎస్ మేనేజర్ టోపి వల్లి మరియు సిబ్బంది, వాలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయండి

- గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి



పులివెందుల నవంబర్ 13 (సీమ వార్త): పులివెందుల పట్టణంలోని గ్రంథాలయంలో శనివారం నుంచి వారం రోజులు పాటు నిర్వహించనున్న గ్రంథాలయ వారోత్సవాలను విజయవంతం చేయాలని గ్రంథాలయ అధికారి కృష్ణ కిషోర్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల దినోత్సవం పురస్కరించుకొని 59వ వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. సందర్భంగా 14న గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభమవుతాయన్నారు, 15న పుస్తక పఠనం, 16న గ్రంథాలయ ఉద్యమ నాయకులను స్మరించుకోవడం, 17న విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, 18న చిత్రలేఖన పోటీలు, 19న మహిళా దినోత్సవం, 20వ తేదీన గ్రంథాలయ వారోత్సవాల ముగింపును పురస్కరించుకొని విజేతలకు బహుమతులను ప్రధానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

వైస్ ఎంపీపీ పదవి శివశంకర్ గౌడ్‌కు కేటాయించాలి!

పార్టీ విజయానికి కృషి చేసిన నాయకుడికి సముచిత గుర్తింపు ఇవ్వాలని కార్యకర్తల ఆకాంక్ష



లేపాక్షి నవంబర్ 13 సీమ వార్త : మండల రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, తెలుగుదేశం పార్టీ తరఫున ఎంపీటీసీ-4 స్థానంలో విజయం సాధించిన ఈడిగ శివశంకర్ గౌడ్‌కు వైస్ ఎంపీపీ పదవి కేటాయించాలని పార్టీ శ్రేణులు, అభిమానులు ఆకాంక్షిస్తున్నారు. పార్టీ పట్ల నిబద్ధతతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న శివశంకర్ గౌడ్‌కు ఈ పదవి దక్కితే సముచిత గౌరవం లభించినట్లవుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల్లో ప్రజల మద్దతుతో విజయం సాధించిన ఆయనకు మండల స్థాయిలో మరింత బాధ్యత అప్పగిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి, గ్రామాల అభివృద్ధికి కృషి చేసే అవకాశం ఉంటుందని కార్యకర్తలు పేర్కొంటున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకులను గుర్తించి తగిన పదవులు కేటాయించడం ద్వారా కార్యకర్తల్లో మరింత ఉత్సాహం పెరుగుతుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ అధిష్ఠానం శివశంకర్ గౌడ్ సేవలను, ప్రజల్లో ఆయనకున్న ఆదరణను పరిగణనలోకి తీసుకుని వైస్ ఎంపీపీ పదవిని కేటాయించాలని పార్టీ అభిమానులు, కార్యకర్తలు కోరుతున్నారు.

లోటస్ స్కూల్లో ఘనంగా బాలల దినోత్సవం

చిన్నారుల సందడితో కళకళలాడిన పాఠశాల

తాడిపత్రి, నవంబర్ 13 వార్త: తాడిపత్రి పట్టణంలోని సంజీవ్ నగర్ లో గల ది లోటస్ ఇంటర్నేషనల్ ప్లే ఓ ప్రీ స్కూల్ నందు శుక్రవారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ప్రతి ఏటా నవంబర్ 14న బాలల దినోత్సవాన్ని జరుపుకుంటామని, పిల్లలంటే చాచా నెహ్రూకు ఎంతో ఇష్టమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల డైరెక్టర్ రమ్య , అకడమిక్ డైరెక్టర్ సురేష్ , అడ్మిన్ / ప్రెసిడెంట్ డైరెక్టర్ బాబు హాజరయ్యారు. చిన్నారులు ఆటలు, పాటలు, డ్యాన్స్ లతో సందడి చేశారు. ఉపాధ్యాయులు కూడా పిల్లల కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి వారిని అలరించారు.పిల్లలకు బహుమతులు, చాక్లెట్లు అందజేసి, బాలల దినోత్సవ విశిష్టతను వివరించారు. చిన్నారులే భవిష్యత్తుకు పునాది అని, వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడమే తమ లక్ష్యమని డైరెక్టర్లు తెలిపారు. పిల్లలు చాలా సంతోషంగా గడిపారని, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో అల్లర్లు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు!

రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత నేరస్థులకు అడిషనల్ ఎస్పీ అంకిత సురానా ఐపీఎస్ కౌన్సెలింగ్.



ముదిగుబ్బ నవంబర్ 13 సీమ వార్త త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, రాజకీయ ఘర్షణలు, అల్లర్లకు పాల్పడినా ఉపేక్షించేది లేదని అడిషనల్ ఎస్పీ అంకిత సురానా ఐపీఎస్ హెచ్చరించారు.జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు శుక్రవారం ముదిగుబ్బ అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్, తాడిమర్రి, బత్తలపల్లి పోలీస్ స్టేషన్లను అడిషనల్ ఎస్పీ సందర్శించారు. ఆయా పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లు, ట్రబుల్ మాంగర్స్, పాత నేరస్థులకు ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి, ఎన్నికల సమయంలో ఎలాంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా చట్ట నిబంధనలు పాటించాలని సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని, బెయిల్‌పై ఉన్నవారు షరతులు ఉల్లంఘిస్తే బెయిల్ రద్దుకు చర్యలు తీసుకుని తిరిగి రిమాండ్‌కు పంపిస్తామని హెచ్చరించారు. బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే పూచీకత్తుగా సమర్పించిన రూ.5 లక్షల మొత్తాన్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి వస్తుందని స్పష్టం చేశారు.

అనంతరం రెండు పోలీస్ స్టేషన్లలో రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో కదిరి డీఎస్పీ లు శివనారాయణ స్వామి, బీవీ జగన్నాథరాజు ,సీఐలు రామసుబ్బయ్య, సునీత , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పోలీసుల ఫుట్ పెట్రోలింగ్..



చిలమత్తూరు నవంబర్ 13 సీమ వార్త సర్పంచ్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా అందరూ సహకరించాలి... డీఎస్పీ రవిబాబు.. కోడూరు, కోడికొండ గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ఎన్నికలపై అవగాహన ...త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించే లక్ష్యంతో శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ శ్రీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా హిందూపురం రూరల్ రవిబాబు గారు స్వయంగా, ఎస్ఐ శ్రీధర్ మరియు పోలీసు సిబ్బందితో కలిసి చిలమత్తూరు మండల పరిధిలోని కోడూరు, కోడికొండ గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు,ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామస్తులతో మాట్లాడి ఎన్నికల సమయంలో శాంతిభద్రతలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. పోలింగ్ రోజున ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమ నిబంధనలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు,ఎన్నికలకు సంబంధించిన నేరాలకు, గొడవలు, ఘర్షణలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు,ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.

గర్భిణులకు ఆపన్నహస్తం.. 140 మందికి అన్నదానం

కుమార్తె పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎనిమిదేళ్లుగా సేవా కార్యక్రమాలు....

అన్నదానం చేయడం దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నా: పరిగి వేణుగోపాల్ రావు

పరిగి నవంబర్ 13 సీమ వార్త : సేవ చేయాలనే సంకల్పం ఉంటే ప్రతి సందర్భాన్ని ఒక మంచి అవకాశంగా మార్చుకోవచ్చని నిరూపిస్తున్నారు దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత, హైకోర్టు న్యాయవాది, బీజేపీ నాయకుడు పరిగి వేణుగోపాల్ రావు. పేదలకు, అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తూ తన కుమార్తె పేరుతో స్థాపించిన ట్రస్ట్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పరిగి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు నిర్వహించిన ఉచిత ఆరోగ్య పరీక్షల కార్యక్రమం సందర్భంగా దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రత్యేక అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 120 మంది గర్భిణీ స్త్రీలతో పాటు మరో 20 మందికి కలిపి మొత్తం 140 మందికి భోజన సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా పరిగి వేణుగోపాల్ రావు మాట్లాడుతూ 2018లో తన కుమార్తె దివ్య పేరుతో దివ్య ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించినట్లు తెలిపారు. అప్పటి నుంచి నిరంతరం పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, ముఖ్యంగా అన్నదాన కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కంటే గొప్ప సేవ మరొకటి లేదని, అన్నదాన కార్యక్రమం నిర్వహించే అవకాశం తనకు దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి తన వంతు సహకారం అందించాలన్నదే తన ఆకాంక్ష అని,



భవిష్యత్తులోనూ ఈ సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని తెలిపారు. కుమార్తె పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ, అవసరమైన వారికి అండగా నిలుస్తున్న పరిగి వేణుగోపాల్ రావు సేవాభావం పలువురి ప్రశంసలు అందుకుంటోంది.

డి.హిరేహాల్ మండలంలో సర్పంచ్, వార్డు స్థానాల రిజర్వేషన్లు ఖరారు

....16 గ్రామ పంచాయతీలకు రిజర్వేషన్ల ప్రకటన.. ఎన్నికల షెడ్యూల్ విడుదలతో గ్రామాల్లో రాజకీయ సందడి

డి.హిరేహాల్, నవంబర్ 13 (సీమవార్త): గ్రామ పంచాయతీల రెండో సాధారణ ఎన్నికలు--2026 నిర్వహణకు సంబంధించి డి.హిరేహాల్ మండలంలోని 16 గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఈ మేరకు గ్రామ పంచాయతీల వారీగా సర్పంచ్, వార్డు స్థానాల రిజర్వేషన్ల వివరాలను ఎంపీడీఓ దాసనాయక్ అధికారికంగా ప్రకటించారు. ఎన్నికల షెడ్యూల్‌కు అనుగుణంగా తదుపరి ప్రక్రియ కొనసాగుతుందని ఆయన తెలిపారు.

సర్పంచ్ స్థానాల రిజర్వేషన్లు ఇలా..

చెర్లోపల్లి -- బీసీ మహిళ, డి.హిరేహాల్ -- బీసీ జనరల్, దొడగట్ట -- జనరల్, గొడిసెలపల్లి -- జనరల్, హులికల్ -- బీసీ జనరల్, జజరకల్లు -- ఎస్సీ మహిళ, కదలూరు -- జనరల్, ఎం.హనుమాపురం -- ఎస్సీ జనరల్, మదేనహళ్లి -- జనరల్, మలపనగుడి -- బీసీ మహిళ, మల్లికేతి -- బీసీ జనరల్, మురడి -- జనరల్ మహిళ, నాగలాపురం -- జనరల్ మహిళ, ఓబులాపురం -- జనరల్ మహిళ, పులకుర్తి -- జనరల్ మహిళ, సోమలాపురం -- బీసీ మహిళగా రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

వార్డుల వారీగా రిజర్వేషన్ల వివరాలు..

ఎంపీడీఓ దశనాయక్ ప్రకటించిన వివరాల ప్రకారం గ్రామాల వారీగా వార్డుల రిజర్వేషన్లు ఇలా ఉన్నాయి.

1. చెర్లోపల్లి: 1వ వార్డు ఎస్సీ జనరల్, 2వ వార్డు జనరల్ మహిళ, 3వ వార్డు జనరల్, 4వ వార్డు బీసీ మహిళ, 5వ వార్డు బీసీ జనరల్, 6వ వార్డు బీసీ మహిళ, 7వ వార్డు జనరల్, 8వ వార్డు ఎస్సీ మహిళ, 9వ వార్డు జనరల్ మహిళ, 10వ వార్డు జనరల్. 2. డి.హిరేహాల్: 1వ వార్డు జనరల్, 2వ వార్డు ఎస్సీ మహిళ, 3వ వార్డు బీసీ జనరల్, 4వ వార్డు బీసీ మహిళ, 5వ వార్డు బీసీ జనరల్, 6వ వార్డు జనరల్ మహిళ, 7వ వార్డు జనరల్ మహిళ, 8వ వార్డు బీసీ జనరల్, 9వ వార్డు జనరల్, 10వ వార్డు జనరల్ మహిళ, 11వ వార్డు బీసీ మహిళ, 12వ వార్డు జనరల్, 13వ వార్డు బీసీ మహిళ, 14వ వార్డు జనరల్. 3. దొడగట్ట: 1వ వార్డు బీసీ మహిళ, 2వ వార్డు బీసీ జనరల్, 3వ వార్డు జనరల్ మహిళ, 4వ వార్డు ఎస్సీ మహిళ, 5వ వార్డు ఎస్సీ జనరల్, 6వ వార్డు జనరల్, 7వ వార్డు జనరల్ మహిళ, 8వ వార్డు జనరల్. 4. గొడిసెలపల్లి: 1వ వార్డు జనరల్, 2వ వార్డు బీసీ మహిళ, 3వ వార్డు జనరల్, 4వ వార్డు బీసీ మహిళ, 5వ వార్డు జనరల్ మహిళ, 6వ వార్డు జనరల్, 7వ వార్డు బీసీ



జనరల్, 8వ వార్డు బీసీ మహిళ, 9వ వార్డు బీసీ జనరల్, 10వ వార్డు జనరల్ మహిళ, 11వ వార్డు జనరల్ మహిళ, 12వ వార్డు బీసీ జనరల్. 5. హులికల్: 1వ వార్డు జనరల్, 2వ వార్డు జనరల్ మహిళ, 3వ వార్డు బీసీ జనరల్, 4వ వార్డు ఎస్సీ మహిళ, 5వ వార్డు జనరల్, 6వ వార్డు బీసీ మహిళ, 7వ వార్డు బీసీ జనరల్, 8వ వార్డు జనరల్ మహిళ, 9వ వార్డు బీసీ మహిళ, 10వ వార్డు జనరల్. 6. జజరకల్లు: 1వ వార్డు ఎస్సీ మహిళ, 2వ వార్డు ఎస్సీ జనరల్, 3వ వార్డు బీసీ జనరల్, 4వ వార్డు జనరల్, 5వ వార్డు జనరల్ మహిళ, 6వ వార్డు బీసీ మహిళ, 7వ వార్డు జనరల్, 8వ వార్డు జనరల్ మహిళ, 9వ వార్డు జనరల్ మహిళ, 10వ వార్డు బీసీ జనరల్. 7. కదలూరు: 1వ వార్డు జనరల్, 2వ వార్డు జనరల్ మహిళ, 3వ వార్డు జనరల్ మహిళ, 4వ వార్డు ఎస్సీ మహిళ, 5వ వార్డు జనరల్, 6వ వార్డు ఎస్సీ జనరల్, 7వ వార్డు బీసీ జనరల్, 8వ వార్డు జనరల్ మహిళ, 9వ వార్డు బీసీ మహిళ, 10వ వార్డు బీసీ జనరల్. 8. ఎం.హనుమాపురం: 1వ వార్డు జనరల్, 2వ వార్డు బీసీ జనరల్, 3వ వార్డు జనరల్ మహిళ, 4వ వార్డు జనరల్, 5వ వార్డు ఎస్సీ మహిళ, 6వ వార్డు ఎస్సీ మహిళ, 7వ వార్డు జనరల్, 8వ వార్డు జనరల్ మహిళ, 9వ వార్డు బీసీ మహిళ, 10వ వార్డు ఎస్సీ జనరల్. 9. మదేనహళ్లి: 1వ వార్డు బీసీ జనరల్, 2వ వార్డు జనరల్, 3వ వార్డు జనరల్ మహిళ, 4వ వార్డు జనరల్ మహిళ, 5వ వార్డు జనరల్, 6వ వార్డు జనరల్, 7వ వార్డు బీసీ మహిళ, 8వ వార్డు బీసీ మహిళ, 9వ వార్డు బీసీ మహిళ, 10వ వార్డు బీసీ జనరల్. 10. మలపనగుడి: 1వ వార్డు బీసీ జనరల్, 2వ వార్డు జనరల్ మహిళ, 3వ వార్డు ఎస్సీ మహిళ, 4వ వార్డు ఎస్టీ జనరల్, 5వ వార్డు జనరల్, 6వ వార్డు జనరల్, 7వ వార్డు బీసీ మహిళ, 8వ వార్డు ఎస్టీ మహిళ, 9వ వార్డు జనరల్, 10వ వార్డు జనరల్ మహిళ. 11. మల్లికేతి: 1వ వార్డు బీసీ మహిళ, 2వ వార్డు జనరల్, 3వ వార్డు బీసీ మహిళ, 4వ వార్డు జనరల్ మహిళ, 5వ వార్డు జనరల్, 6వ వార్డు బీసీ జనరల్, 7వ వార్డు బీసీ మహిళ, 8వ వార్డు జనరల్ మహిళ. 12. మురడి: 1వ వార్డు బీసీ జనరల్, 2వ వార్డు జనరల్, 3వ వార్డు జనరల్ మహిళ, 4వ వార్డు ఎస్సీ జనరల్, 5వ వార్డు జనరల్, 6వ వార్డు జనరల్ మహిళ, 7వ వార్డు ఎస్సీ జనరల్, 8వ వార్డు ఎస్సీ మహిళ, 9వ వార్డు బీసీ మహిళ, 10వ వార్డు బీసీ జనరల్, 11వ వార్డు జనరల్, 12వ వార్డు జనరల్ మహిళ. 13. నాగలాపురం: 1వ వార్డు జనరల్, 2వ వార్డు బీసీ మహిళ, 3వ వార్డు జనరల్ మహిళ, 4వ వార్డు ఎస్సీ మహిళ, 5వ వార్డు జనరల్ మహిళ, 6వ వార్డు జనరల్, 7వ వార్డు జనరల్, 8వ వార్డు బీసీ జనరల్, 9వ వార్డు బీసీ మహిళ, 10వ వార్డు బీసీ జనరల్. 14. ఓబులాపురం: 1వ వార్డు బీసీ జనరల్, 2వ వార్డు జనరల్, 3వ వార్డు ఎస్సీ మహిళ, 4వ వార్డు జనరల్, 5వ వార్డు జనరల్, 6వ వార్డు బీసీ మహిళ, 7వ వార్డు జనరల్ మహిళ, 8వ వార్డు జనరల్ మహిళ, 9వ వార్డు బీసీ జనరల్, 10వ వార్డు జనరల్ మహిళ, 11వ వార్డు ఎస్సీ మహిళ, 12వ వార్డు ఎస్సీ జనరల్. 15. పులకుర్తి: 1వ వార్డు జనరల్ మహిళ, 2వ వార్డు బీసీ జనరల్, 3వ వార్డు జనరల్ మహిళ, 4వ వార్డు బీసీ జనరల్, 5వ వార్డు ఎస్సీ మహిళ, 6వ వార్డు ఎస్సీ జనరల్, 7వ వార్డు బీసీ మహిళ, 8వ వార్డు బీసీ మహిళ, 9వ వార్డు జనరల్, 10వ వార్డు జనరల్ మహిళ, 11వ వార్డు జనరల్, 12వ వార్డు జనరల్. 16. సోమలాపురం: 1వ వార్డు జనరల్ మహిళ, 2వ వార్డు ఎస్సీ జనరల్, 3వ వార్డు జనరల్, 4వ వార్డు బీసీ జనరల్, 5వ వార్డు జనరల్, 6వ వార్డు బీసీ మహిళ, 7వ వార్డు ఎస్సీ మహిళ, 8వ వార్డు జనరల్ మహిళ, 9వ వార్డు జనరల్, 10వ వార్డు ఎస్సీ మహిళ.

ఎన్నికల షెడ్యూల్ ఇలా..

నవంబర్ 15న ఎన్నికల నోటీసు ప్రకటన, నవంబర్ 17న నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ, నవంబర్ 18న నామినేషన్ల పరిశీలన, నవంబర్ 19న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ, నవంబర్ 20న పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా, నవంబర్ 21న ఎన్నికల గుర్తుల కేటాయింపు చేపట్టనున్నారు. నవంబర్ 26న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్, అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. నవంబర్ 27న అవసరమైన చోట రీపోలింగ్ నిర్వహించేలా షెడ్యూల్‌లో పేర్కొన్నారు. ఈ వివరాలను ఎంపీడీఓ దశనాయక్ వెల్లడించారు. రిజర్వేషన్ల ప్రకటనతో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేయాలనుకుంటున్న ఆశావహుల్లో ఆసక్తి నెలకొంది. గ్రామాల్లో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతుండగా, ప్రధాన పార్టీల నాయకులు అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుండటంతో గ్రామాల్లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది.

పీజీ స్పాట్ అడ్మిషన్స్ రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

పేద విద్యార్థులకు యూనివర్సిటీలో చదువుకునే అవకాశం కల్పించాలి

విద్యార్థుల ప్రొవిజినల్ సర్టిఫికెట్స్ వెంటనే ఇవ్వాలి

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ జ్యోతి కుమార్ కి వినతి

ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్

గుంతకల్ నవంబర్ 13 సీమా వార్త గుంతకల్ అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గుంతకల్లు పట్టణం లోని ఎస్,ఎస్,జి,ఎస్ డిగ్రీ కళాశాలలో శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ (వి.సి.) ఎన్.వి.ఆర్. జ్యోతి కుమార్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వెంకట్ నాయక్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావాల్సిన బాధ్యత యూనివర్సిటీ అధికారులపై ఉందని అన్నారు. పీజీ స్పాట్ అడ్మిషన్లను రద్దు చేయాలనే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థులకు విశ్వవిద్యాలయంలో చదువుకునే అవకాశాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా విద్యార్థులకు సంబంధించిన ప్రొవిజనల్ సర్టిఫికెట్లను ఎలాంటి జాప్యం లేకుండా వెంటనే అందజేయాలని, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు ముఖ్యంగా గుంతకల్లు పట్టణంలోని ఎస్‌కేపీ డిగ్రీ కళాశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాలను



దృష్టిలో ఉంచుకొని ఆర్.ఓ. వాటర్ ప్లాంట్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని యూనివర్సిటీ అధికారులు స్పందించి పై సమస్యలన్నింటినీ తక్షణమే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పట్టణ కోశాధికారి యస్వంత్ సూరి సాయి కిరణ్ వినోద్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు ఘటన విద్యార్థినికి స్పందన హాస్పిటల్ వారు 50 వేల రూపాయల ఆర్థిక సహాయం.

డాక్టర్ బషీర్, డాక్టర్ సోనియా, డాక్టర్ కరిష్మా.



ధర్మవరం నవంబర్ 13 సీమ వార్త: రాప్తాడు పాఠశాలలో జరిగిన ఉన్మాది దాడి ఘటనలో మత్తు పదార్థాలకు బానిసైన కిరాతకుడి చేతిలో గాయపడ్డ పదవ తరగతి చదువుతున్న విద్యార్థినిని వారి తల్లిదండ్రులను, వైద్యులను ధర్మవరం స్పందన వైద్యులు డాక్టర్ బషీర్, డా. సోనియా ,డా.కరిష్మా మణిపాల్ హాస్పిటల్,బెంగళూరుకు వెళ్లి పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ, దాడిలో అత్యంత ప్రమాదకర స్థాయి లో గాయపడ్డ అమ్మాయి చక్కగా రికవరీ అయ్యి, చక్కగా మాట్లాడుతూ నడువగలుగుతోంది అని తెలిపారు. శుక్రవారం నాడుగాయాల కుట్లు విప్పడానికి వైద్యులు సన్నద్ధత చేసుకుంటూ ఉన్నారు అని తెలిపారు. అమ్మాయికి, వారి తల్లిదండ్రులకు ధైర్యం చెబుతూ, అమ్మాయి వారి తల్లితండ్రులు ఈ సంఘటనను త్వరగా మరచిపోయి, మానసికంగా దృఢంగా తయారయి అమ్మాయి భవిష్యత్తుకు మంచి పునాదులు వేసుకోవాలని, అందుకు అన్నివిధాలా తాము సహకరిస్తామని వారికి మనోధైర్యం కల్పిస్తూ స్పందన హాస్పిటల్ తరపున 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం వారికి అందజేశారు. మరికొన్ని వారాల్లో సంపూర్ణంగా కోలుకొని ఆ అమ్మాయి మళ్ళీ చదువు మొదలు పెట్టగలుగుతుందనే ఆశాభావం వారు వెలిబుచ్చారు. మన పరిసరాల్లో పిల్లలు,యువకులు మత్తుపదార్థాలకు అలవాటుపడకుండా అందరం కృషిచేయాలని డాక్టర్. బషీర్ డాక్టర్ సోనియా డా.కరిష్మా తెలిపారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన....



గాండ్లపెంట నవంబర్ 13 సీమ వార్త.... బాలల దినోత్సవం, జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకొని ఫౌండేషన్ ఫర్ ఎకాలజీ సెక్యూరిటీ (ఎఫ్ఈఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పర్యావరణ అంశంపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని, ప్రకృతి వనరులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఇలాంటి పోటీలు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని అన్నారు. పోటీల్లో తొమ్మిదో తరగతికి చెందిన కె. నందిని ప్రథమ, పదో తరగతికి చెందిన ఆర్. శ్రావణి ద్వితీయ, తొమ్మిదో తరగతికి చెందిన నా యాసీశ్వినీ తృతీయ బహుమతులు సాధించారు. పోటీల్లో పాల్గొన్న దాదాపు 73 మంది విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు మనీషా, సుధ, ఎఫ్ఏ సుహాసిని, ఉపాధ్యాయులు చిన్నప్పయ్య, హరిప్రసాద్, మూర్తి, తాహెర్ వలి, లక్ష్మీనారాయణరెడ్డి, ఉమామహేశ్వర్, రాజశేఖర్, నాగశేషు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలి.

ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ మురళి.



ధర్మవరం నవంబర్ 13 సీమ వార్త ; విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను తప్పక అభ్యసించాలని ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ మురళి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని కాగితాల వీధిలో గల ప్రణవ సాయి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ వారు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ చిత్రలేఖన పోటీలో 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రతిభ కనబరిచిన ఏ. ఓం ప్రణీత్, బి.గీత, టి. హర్షిత రెడ్డి, గోల్డ్ మెడల్ సాధించుకోగా, జే. భవిష్య, సి .ప్రణీత, కె.జోయా వారు సిల్వర్ మెడల్స్ ని సాధించారు. అనంతరం ఎస్బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ వారు ప్రశంసాపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ ఆదిలక్ష్మి, కర్రిస్పాండెంట్ కిషోర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా బాలలదినోత్సవం.

పెనుకొండ నవంబర్ 13 సీమవార్త.




దేశ మొదటి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి ని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని దర్గాపేటలోని అంగన్వాడీ కేంద్రంలో ఆల్ కౌసర్ సామాజిక సేవా సంస్థ అధ్యక్షులు సయ్యద్ మహమ్మద్ హుస్సేన్ చిన్నారులకు పలకలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని వారి ఆలోచనలే రేపటి దేశ బౌవిషత్ కు పునాదులన్నారు. చిన్నతనంలో మంచి విద్య, సంస్కారం అందిస్తే భౌవిషత్ లో వారు మంచి పౌరులు గా ఎదుగుతారని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను పాఠశాలకు పంపి ఉత్తమ పౌరులు గా తీర్చి దిద్దాలన్నారు. పిల్లలు దేశానికి నిజమైన సంపదని నెహ్రూ మాటలు స్ఫూర్తితో ముందుకు నడవాలన్నారు. బాలకార్మిక వ్యవస్థ ను నిర్మూలించి నవభారత నిర్మాణానికి పునాదులు వేయాలన్నారు.

బాల్యమే బంగారు భవిష్యత్తుకు పునాది.. బాలల చిరునవ్వుల్లోనే రేపటి భారతం

నవంబర్ 14 -- జాతీయ బాలల దినోత్సవం

జాతీయ బాలల దినోత్సవం ప్రత్యేక కథనం





ప్రొద్దుటూరు, నవంబర్ 13, (సీమ వార్త) : బాలలే దేశ సంపద.. వారి ఎదుగుదలే జాతి అభివృద్ధికి బాట! పుస్తకాల భారంతో కాదు.. విజ్ఞానంతో వికసించాలి బాల్యం.. ఆటపాటలు, చదువులు, సంస్కారాలతో ఎదగాలి చిన్నారులు.. బాల కార్మికత్వం, బాల్యవివాహాలు, వివక్ష, హింసకు దూరంగా సురక్షిత వాతావరణం కల్పించాలి.. ప్రతి చిన్నారికి విద్య, వైద్యం, పోషకాహారం, సమాన అవకాశాలు అందినప్పుడే అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణం సాధ్యం! దేశ భవిష్యత్తు తరగతి గదుల్లో రూపుదిద్దుకుంటుంది.. చిన్నారుల కలల్లోనే రేపటి సమాజం ప్రతిబింబిస్తుంది. బాల్యం అనేది ప్రతి మనిషి జీవితంలో అత్యంత మధురమైన, విలువైన దశ. ఈ దశలో పిల్లలకు అందే ప్రేమ, ఆప్యాయత, విద్య, సంస్కారం, ప్రోత్సాహమే వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయి. అందుకే బాలల హక్కులు, వారి సంక్షేమం, సమగ్ర అభివృద్ధిపై సమాజానికి అవగాహన కల్పించేందుకు నవంబర్ 14న జాతీయ బాలల దినోత్సవాన్ని జరుపుకుంటారు. భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఈ రోజును బాలల దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. నెహ్రూకు పిల్లలంటే ఎంతో ఇష్టం. చిన్నారుల పట్ల ఆయన చూపిన ప్రేమాభిమానాల కారణంగా పిల్లలు ఆయనను ఆప్యాయంగా 'చాచా నెహ్రూ' అని పిలిచేవారు. పిల్లలే దేశ భవిష్యత్తు అని, వారికి నాణ్యమైన విద్య, ఆరోగ్యకరమైన వాతావరణం, సమాన అవకాశాలు కల్పించాలని ఆయన ఆకాంక్షించేవారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రతి చిన్నారికి విద్య, ఆరోగ్యం, పోషకాహారం, రక్షణ, స్వేచ్ఛగా ఎదిగే హక్కు ఉంది. పేద, ధనిక అనే తేడా లేకుండా సమాజంలోని ప్రతి బాలబాలికకు సమాన అవకాశాలు కల్పించాలి. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క చిన్నారి కూడా చదువుకు దూరం కాకూడదు. బాల కార్మికత్వం, బాల్యవివాహాలు, బాలలపై వేధింపులు, వివక్ష వంటి సామాజిక రుగ్మతలను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది. పిల్లలకు సురక్షితమైన కుటుంబ, పాఠశాల, సామాజిక వాతావరణాన్ని కల్పించడం ప్రభుత్వంతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత.

చదువుతో పాటు ఆటపాటలకూ ప్రాధాన్యం

నేటి పోటీ ప్రపంచంలో చిన్నారులపై చదువుల ఒత్తిడి రోజురోజుకూ పెరుగుతోంది. మంచి మార్కులు సాధించాలనే తల్లిదండ్రుల ఆకాంక్షలు, పాఠశాలల పోటీ వాతావరణం పిల్లల బాల్యాన్ని ప్రభావితం చేస్తున్నాయి. చదువు ఎంత ముఖ్యమో ఆటపాటలు, స్నేహాలు, సృజనాత్మకత కూడా అంతే ముఖ్యమని గుర్తించాలి. పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలి. క్రీడలు, సంగీతం, చిత్రలేఖనం, విజ్ఞాన సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొనేలా అవకాశాలు కల్పించాలి. పిల్లలపై తమ ఆశయాలను రుద్దకుండా వారి ఆసక్తులు, అభిరుచులకు అనుగుణంగా ఎదిగేందుకు తల్లిదండ్రులు సహకరించాలి.

పోషకాహారం.. ఆరోగ్యకరమైన బాల్యానికి పునాది

చిన్నతనంలో లభించే పోషకాహారమే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలకు కీలకం. ప్రస్తుత కాలంలో జంక్‌ఫుడ్, శీతల పానీయాలు, అధిక చక్కెర కలిగిన ఆహార పదార్థాల వినియోగం పెరుగుతోంది. వీటికి బదులుగా పాలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలతో కూడిన సమతుల ఆహారాన్ని అందించాలి. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత, క్రమబద్ధమైన నిద్ర, శారీరక వ్యాయామంపై చిన్నతనం నుంచే అవగాహన కల్పించాలి. పిల్లల ఎదుగుదలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అవసరమైన వైద్య పరీక్షలు చేయించాలి.

ఆధునిక సాంకేతికతతో కొత్త సవాళ్లు

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ పిల్లల జీవితాల్లో మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాల ప్రభావం పెరుగుతోంది. వీటి ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకునే అవకాశాలు ఉన్నప్పటికీ, అతిగా వినియోగించడం వల్ల చదువు, నిద్ర, శారీరక శ్రమ, మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా ఆన్‌లైన్ వేధింపులు, అనుచిత కంటెంట్, సైబర్ మోసాల పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి. మొబైల్ ఫోన్లకు పరిమితం చేయకుండా పుస్తక పఠనం, క్రీడలు, ప్రకృతితో మమేకం కావడం వంటి అలవాట్లను ప్రోత్సహించాలి.

పిల్లల చిరునవ్వులే దేశాభివృద్ధికి కొలమానం

బాలల దినోత్సవం కేవలం వేడుకలకే పరిమితం కాకూడదు. పిల్లల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యతను ప్రతి ఒక్కరికీ గుర్తుచేసే రోజుగా నిలవాలి. పాఠశాలల్లో బాలల దినోత్సవ వేడుకలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలు నిర్వహించడంతో పాటు బాలల హక్కులు, బాధ్యతలు, ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పించాలి. ప్రతి చిన్నారిలో ఆత్మవిశ్వాసం పెంపొందించి, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తపరిచే అవకాశం కల్పించాలి.బాల్యం భారంగా మారకూడదు.. భవిష్యత్తుకు బాటలు వేసే మధుర జ్ఞాపకంగా మిగలాలి. ప్రతి చిన్నారి కళ్లలో ఆశలు, పెదవులపై చిరునవ్వులు, మనసులో కొత్త ఆలోచనలు వికసించినప్పుడే నిజమైన బాలల దినోత్సవానికి సార్థకత చేకూరుతుంది. బాలల సంక్షేమమే దేశ సంక్షేమం.. వారి అభ్యున్నతే జాతి ప్రగతికి అసలైన సూచిక!

డ్రైడే ఫ్రైడేపై ప్రజలకు అవగాహన

మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాల నివారణకు ప్రతి శుక్రవారం పరిసరాల పరిశుభ్రత పాటించాలి



బొమ్మనహల్, నవంబర్ 13 (సీమ వార్త): బొమ్మనహల్ మండలంలోని ఉద్దేహాల్ గ్రామ బీసీ కాలనీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రజలకు డ్రైడే ఫ్రైడే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు, విషజ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆరోగ్య సిబ్బంది ప్రజలకు వివరించారు. ప్రతి శుక్రవారం ఇంట్లోని నీటి పాత్రలు, డ్రమ్ములు, తొట్లు, కూలర్లు, రోళ్లు, పాత టైర్లలో నీరు నిల్వ ఉండకుండా శుభ్రం చేసుకోవాలని సూచించారు. నీటిని నిల్వ చేసుకునే పాత్రలకు తప్పనిసరిగా మూతలు పెట్టుకోవాలని, దోమలు వృద్ధి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన్, శారద, ఆశా కార్యకర్తలు ఈరమ్మ, లక్ష్మి, హరిత, లక్ష్మితో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన గుమ్మనూరు నారాయణస్వామి



గుంతకల్ నవంబర్ 13 సీమా వార్త గుంతకల్ పట్టణ మాజీ కౌన్సిలర్ తాండూరు గోపి ఆహ్వానం మేరకు, పట్టణంలోని శ్రీ మార్కండేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన వివాహ వేడుకకు గుంతకల్ మండల ఇంచార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన వధూవరులు నాగకృష్ణ తేజ, పోషిత దంపతులను పుష్పగుచ్ఛంతో అభినందించి,వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మరియు గుంతకల్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్, బివిస్ కృష్ణారెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, సీనియర్ నాయకుడు మస్తానప్ప, కౌన్సిలర్లు, నందీశ్వర్, రమేష్,కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానిక కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాలు


చిలమత్తూరు నవంబర్ 13 సీమ వార్త చిలమత్తు శాఖా గ్రంథాలయంలో నవంబర్ 14 నుంచి 20 వరకు 5 9 వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రంథాలయ అధికారి ఆర్.మల్లికార్జున తెలిపారు. బాలల దినోత్సవంతో ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో పుస్తక ప్రదర్శన, కవి సమ్మేళనం, రచయితల చర్చా వేదిక, వ్యాసరచన, క్రీడా పోటీలు, మహిళలకు రంగవల్లుల అల్లికలు, డిజిటల్ గ్రంథాలయాలపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయి. విద్యార్థులు, పాఠకులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

చిన్నారులు.. దేశ భవిష్యత్తును నిర్మించే శక్తులు

పిల్లల చిరునవ్వుల్లోనే రేపటి భారతదేశం కనిపించాలి

- నేడు బాలల దినోత్సవం

మిట్ట మహేష్ సీనియర్ జర్నలిస్ట్ పులివెందుల



పులివెందుల నవంబర్ 13 (సీమ వార్త): భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజును బాలల దినోత్సవంగా నిర్వహిస్తారు. ఆయనను పిల్లలు ప్రేమగా "చాచా నెహ్రూ" అని పిలుచుకుంటారు. లక్ష్యం: "పిల్లలే దేశ భవిష్యత్తు" అని నమ్మిన నెహ్రూ ఆశయాలకు అనుగుణంగా, బాలల సంక్షేమం, మంచి విద్య, హక్కుల పరిరక్షణ మరియు వారి సృజనాత్మకతను పెంపొందించడం ఈ దినోత్సవ ముఖ్య ఉద్దేశం. చరిత్ర: 1964లో నెహ్రూ మరణం తర్వాత, ఆయన జయంతి అయిన నవంబర్ 14ను అధికారికంగా బాలల దినోత్సవంగా ప్రకటించారు. అంతకుముందు భారత్‌లో ఐక్యరాజ్యసమితి సూచన మేరకు నవంబర్ 20న జరిపేవారు.


ప్రపంచ బాలల దినోత్సవం:

ఐక్యరాజ్యసమితి ప్రకటన ప్రకారం ప్రపంచవ్యాప్తంగా నవంబర్ 20న ప్రపంచ బాలల దినోత్సవాన్ని జరుపుకుంటారు. వివిధ దేశాలు వేర్వేరు తేదీల్లో (ఉదాహరణకు చైనాలో జూన్ 1, జపాన్‌లో మే 5) కూడా ఈ వేడుకలు నిర్వహిస్తాయి. భారతదేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినాన్ని పురస్కరించుకుని నవంబర్ 14న జరుపుకునే బాలల దినోత్సవాన్ని 'బాల్ దివాస్' అని కూడా అంటారు. భగవంతుడు ప్రత్యక్షమై నీకేం వరం కావాలని అడిగితే.. మనలో చాలామంది తమ బాల్యం తిరిగి ఇవ్వమని అడుగుతామంటారు. భగవంతుడు ఇచ్చిన గొప్పవరం బాల్యం. చాలా దేశాల్లో బాలల దినోత్సవం నిర్వహిస్తుంటారు. భారతదేశంలో మాత్రం ఏటా నవంబర్ 14 వ తేదీన 'బాలల దినోత్సవం' జరుపుకుంటాం. చాచా నెహ్రూ జయంతి (రోజున ఈ చిల్డ్రన్స్ డే (బాలల దినోత్సవం) నిర్వహిస్తారు. ఆ రోజున ఆ మహానుభావుడికి నివాళులు అర్పిస్తూ.. బాలలందరికి శుభాకాంక్షలు చెబుతారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొట్టమొదటి ప్రధానిగా పనిచేశారు జవహర్ లాల్ నెహ్రూ. ఆయన జన్మించిన రోజున బాలల దినోత్సవం జరుపుకోవడానికి గల కారణం అందరికీ తెలిసిందే. స్వాతంత్ర్యోద్యమ కాలంలో నెహ్రూ జీవితం అధిక భాగం జైళ్లలోనే గడిపారు. ఆ సమయంలో తన ఏకైక కుమార్తె ఇందిరా ప్రియదర్శినితో ఎక్కువకాలం గడపలేకపోయారట. నెహ్రూకి పిల్లలన్నా, గులాబీ పూలన్నా చాలా ఇష్టం. పిల్లలను జాతి సంపదలుగా నెహ్రూ చెబుతూ ఉండేవారు. ఆయన పాలనలో దేశంలో బాలల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. అందుకే ఆయన పుట్టినరోజున మన దేశంలో బాలల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ చిల్డ్రన్స్ డే రోజున చాచా నెహ్రూను తలుచుకుని పిల్లలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. బాలల దినోత్సవం చిన్నారులకు సురక్షితమైన, ఆరోగ్యకరమైన బాల్యం అందించే ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. పిల్లల హక్కులను ప్రోత్సహించడం, వారి విద్య, శ్రేయస్సుకి పాటుపడటంతో పాటు, పోషకాహారం, ఇంట్లో సురక్షితమైన వాతావరణం అందించడం వంటి బాధ్యతలను గుర్తు చేస్తుంది. పేదరికం, నిరక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ, బాల కార్మికులుగా మారడం వంటి పిల్లలు ఎదుర్కుంటున్న సవాళ్లపై అవగాహన పెంచుతుంది.

బాలల దినోత్సవం ప్రాముఖ్యత:

బాలల హక్కులను పెంపొందించాలి పిల్లల విద్యను ప్రోత్సహించాలి. పిల్లల అభిప్రాయాలను కూడా గౌరవించాలి. పిల్లల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలి. పిల్లలకు విద్యపైనే కాకుండా గేమ్స్, వినోదంపై కూడా అవగాహన కల్పించాలి. పిల్లల సృజనాత్మక కృషిని ఎల్లప్పుడూ ప్రోత్సహించాలి.

నూతన వధూవరులను ఆశీర్వదించిన టీడీపీ కూటమి నాయకులు



డి.హీరేహాల్ (సీమవార్త): కుడ్లూరు హనుమంతు కుమారుడి వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహానికి టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేసి, నూతన దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బోయ వాల్మీకి సమితి తాలూకా అధ్యక్షుడు మకాసి వెంకటేశులు, ఆర్యవైశ్య చైర్మన్ కుమారుడు సాయిరాం, నాగయ్య, మదేనహళ్లి హనుమంతు, వడ్డే మారెన్న, మకాసి బసవరాజు, మైనారిటీ నాయకుడు ఖాసింపీరా, గంటె వెంకటేష్ తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బూదిలి సర్పంచ్ అభ్యర్థిగా అవకాశం కల్పించండి

... టిడిపి మండల్ కన్వీనర్ బాలకృష్ణ చౌదరికి... బయోడేటా అందజేసిన యువ నేత బూదిలి లక్ష్మీపతి

....పార్టీకి వీర విధేయుడిని.. కష్టకాలంలోనూ పార్టీ వెంటే ఉన్నాం.



గోరంట్ల నవంబర్ 13 సీమ వార్త గోరంట్ల మండలం బూదిలి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా తమ కుటుంబానికి అవకాశం కల్పించాలని కోరుతూ బూదిలి లక్ష్మీపతి తన బయోడేటా టిడిపి మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరి కి అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ పార్టీకి తాము వీర విధేయులమని, పార్టీ కష్టకాలంలోనూ అండగా నిలిచి నిరంతరం పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్నామని తెలిపారు. మంత్రి సవితమ్మకు మద్దతుగా మొదటగా ముందుకు వచ్చిన వారిలో తాను కూడా ఉన్నానని పేర్కొన్నారు. పార్టీ పట్ల తమకున్న విధేయతను, ఇప్పటివరకు చేసిన సేవలను గుర్తించి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బూదిలి సర్పంచ్ స్థానాన్ని తమ కుటుంబానికి కేటాయించి అవకాశం కల్పించాలని కోరారు. ఈ మేరకు తన బయోడేటాను తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ బాలకృష్ణ చౌదరికి, నాయకులకు అందజేసినట్లు తెలిపారు.

నామినేషన్లకు పటిష్ట పోలీస్ బందోబస్తు సీఐ

ధైర్యంగా నామినేషన్లు వేసుకోండి అడ్డుకుంటే కఠిన చర్యలు



టి. సుండుపల్లి నవంబర్ 13సీమ వార్త మండల పరిధిలో ఈనెల 15 నుంచి ప్రారంభం కానున్న సర్పంచ్ నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సురేష్ రెడ్డి, ఎస్ఐ అమర్నాథరెడ్డి తెలిపారు. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ఎనిమిది మంది ఎస్ఐలు, ముగ్గురు సీఐలు, 150 మంది పోలీస్ సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించారు. అభ్యర్థులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా నామినేషన్లు వేసుకోవాలని సూచించారు. నామినేషన్లు వేసే అభ్యర్థులను ఎవరైనా అడ్డుకున్నా, బెదిరింపులకు గురిచేసినా లేదా ఇబ్బందులకు గురిచేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ సురేష్ రెడ్డి, ఎస్ఐ అమర్నాథరెడ్డి తెలిపారు.ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

సహకార సంఘం రైతులు వెంటనే ఈ-కేవైసీ పూర్తి చేసుకోండి

మండల సింగల్ విండో అధ్యక్షుడు గణేష్



అమరాపురం నవంబర్ 13 ప్రభాతవార్త సహకార సంఘాల ఎన్నికల నేపథ్యంలో అమరాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఓటు హక్కు కలిగిన రైతు సభ్యులందరూ వెంటనే ఈ-కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని అమరాపురం సహకార సంఘం అధ్యక్షుడు ఎన్. గణేష్ ,సీఈఓ మంజునాథ్ కోరారు. ఈ-కేవైసీ పూర్తి చేయని సభ్యులు రానున్న సహకార సంఘాల ఎన్నికల్లో తమ ఓటు హక్కును కోల్పోయే అవకాశం ఉందని వారు స్పష్టం చేశారు. ప్రతి రైతు సభ్యుడు ఈ విషయాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకొని తక్షణమే ఈ-కేవైసీ పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కేవైసీ ప్రక్రియను అమరాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రక్రియ కోసం సభ్యులు క్రింది పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని కోరారు: ఆధార్ కార్డ్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, 1-బి, రేషన్ కార్డ్ తీసుకొని రావాలని ఈ నెల 21వ తేదీనే చివరి గడువు కావడంతో, చివరి రోజు వరకు వేచి చూడకుండా రైతు సభ్యులందరూ ముందుగానే సొసైటీ కార్యాలయానికి చేరుకొని ఈ-కేవైసీ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యర్రగుంట్లపల్లి గ్రామంలో 2026--2027 సంవత్సరానికి పంట నీటి ప్రణాళిక కార్యక్రమం...

తనకల్లు,నవంబర్ 13 సీమ వార్త న్యూస్.....శ్రీ సత్యసాయి జిల్లాలోని తనకల్లు మండలంలో జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో, అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ వారి సహకారంతో అమలు చేస్తున్న రాయలసీమ వాటర్ ఇనీషియేటివ్ ప్రాజెక్టులో భాగంగా, 2026--2027 వ్యవసాయ సంవత్సరానికి సంబంధించి పంట నీటి ప్రణాళిక కార్యక్రమాన్ని మల్లిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని యర్రగుంట్లపల్లి గ్రామంలో దేవాలయం ఎదురుగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామంలోని రైతులు హాజరుకాగా, జనజాగృతి సంస్థ ప్రతినిధులు గ్రామస్థాయిలో నీటి లభ్యత, వర్షపాతం, భూగర్భ జలాల పరిస్థితి, పంటల సాగు విస్తీర్ణం, వ్యవసాయ అవసరాలు మరియు నీటి వినియోగంపై రైతులతో విస్తృతంగా చర్చించడం జరిగింది. గ్రామంలో అందుబాటులో ఉన్న సహజ నీటి వనరులను అంచనా వేయడం, వర్షపాతం ద్వారా ఎంత నీరు లభ్యమవుతుంది, అందులో ఎంత నీరు భూమిలోకి ఇంకుతుంది, వ్యవసాయానికి ఎంత నీరు అవసరమవుతుంది, ప్రస్తుత నీటి నిల్వలు భవిష్యత్తు పంటల సాగుకు ఎంతవరకు సరిపోతాయి అనే అంశాలను శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ముఖ్యంగా గ్రామ రైతులు తమ గ్రామంలోని నీటి పరిస్థితిని స్వయంగా అర్థం చేసుకొని, నీటి లభ్యతకు అనుగుణంగా పంటల సాగు నిర్ణయాలు తీసుకోవడం, భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించడం మరియు సామూహిక నీటి నిర్వహణకు సంబంధించిన కట్టుబాట్లను రూపొందించుకోవడంపై ఈ సమావేశంలో ప్రత్యేకంగా దృష్టి సారించడం జరిగింది. కార్యక్రమంలో మొదటగా యర్రగుంట్లపల్లి గ్రామానికి సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని రైతుల భాగస్వామ్యంతో సేకరించి క్రోడీకరించడం జరిగింది. ఈ వివరాల ప్రకారం గ్రామంలో మొత్తం 352 హెక్టార్ల భూ విస్తీర్ణం ఉండగా, 833 మంది జనాభా, 73 పెద్ద పశువులు మరియు 1,122 చిన్న జీవాలు ఉన్నట్లు గుర్తించడం జరిగింది. గ్రామంలోని మొత్తం భూ విస్తీర్ణం, వ్యవసాయ భూముల వినియోగం, జనాభా మరియు పశుసంపద వివరాలను పరిగణనలోకి తీసుకొని గ్రామానికి సంబంధించిన నీటి అవసరాలపై చర్చించడం జరిగింది. ముఖ్యంగా వ్యవసాయానికి మాత్రమే కాకుండా గృహావసరాలకు, పశువుల అవసరాలకు కూడా నీరు అత్యంత కీలకమైన వనరు కావడంతో, అందుబాటులో ఉన్న నీటి వనరులను అన్ని అవసరాలకు సమతుల్యంగా వినియోగించుకోవాల్సిన ప్రాముఖ్యతను రైతులకు వివరించడం జరిగింది. గ్రామంలోని భూమి మరియు పశుసంపద వివరాలను నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో నీటి అవసరాలను అంచనా వేయడానికి అవసరమైన ప్రాథమిక సమాచారాన్ని సిద్ధం చేసుకోవడం జరిగింది. అనంతరం 2026--2027 వ్యవసాయ సంవత్సరానికి సంబంధించిన ఖరీఫ్ మరియు రబీ సీజన్ల వర్షపాత వివరాలను రైతులతో కలిసి విశ్లేషించడం జరిగింది. ఖరీఫ్ సీజన్‌లో 476 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు, రబీ సీజన్‌లో సుమారు 137 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందని అంచనా వేయడం జరిగింది. ఈ వర్షపాతాన్ని గ్రామంలోని 352 హెక్టార్ల భూ విస్తీర్ణంతో అనుసంధానం చేసి గణించగా, ఖరీఫ్ సీజన్‌లో సుమారు 167.55 హెక్టార్ల మీటర్ల వర్షపు నీరు గ్రామ పరిధిలో లభ్యమైనట్లు అంచనా వేయడం జరిగింది. ఈ మొత్తం వర్షపు నీటిలో సుమారు 10 శాతం అనగా 16.75 హెక్టార్ల మీటర్ల నీరు సహజసిద్ధంగా భూమిలోకి ఇంకి భూగర్భ జలాల పెరుగుదలకు దోహదపడుతుందని లెక్కించడం జరిగింది. వర్షం పడినప్పుడు మొత్తం నీటిలో కొంత భాగం భూమిలోకి ఇంకడం, కొంత భాగం ఉపరితల ప్రవాహంగా వెళ్లిపోవడం, మరికొంత భాగం నేలలోని తేమగా నిల్వ ఉండడం వంటి సహజ ప్రక్రియలను రైతులకు వివరించడం జరిగింది. వర్షపు నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి పొలాల్లోనే నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవడం, భూమిలోకి నీరు ఇంకే అవకాశాలను పెంపొందించడం ఎంతో అవసరమని తెలియజేయడం జరిగింది. గ్రామంలోని ఉపరితల నీటి వనరుల పరిస్థితిని కూడా ఈ సమావేశంలో సమీక్షించడం జరిగింది. యర్రగుంట్లపల్లి కుంట మరియు కనికలమ్మ కుంట గ్రామానికి ముఖ్యమైన నీటి నిల్వ వనరులుగా ఉన్నప్పటికీ, ప్రస్తుత వర్షపాతం ద్వారా వాటిలో గణనీయమైన నీటి నిల్వలు ఏర్పడలేదని గుర్తించడం జరిగింది. దీనివల్ల వ్యవసాయానికి అవసరమైన నీటి కోసం రైతులు ప్రధానంగా బోరు బావులు మరియు భూగర్భ జలాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఉందని చర్చించడం జరిగింది. అదే విధంగా గ్రామంలోని నీటి సంరక్షణ నిర్మాణాలు, నీటి మడుగులు మరియు కందకాల ద్వారా సుమారు 0.05 హెక్టార్ల మీటర్ల నీరు భూమిలోకి ఇంకే అవకాశం ఉందని అంచనా వేయడం జరిగింది. పంటల సాగు మరియు ఇతర నీటి సంబంధిత అంశాల ద్వారా సుమారు 0.79 హెక్టార్ల మీటర్ల నీటి పరిమాణాన్ని కూడా నీటి బడ్జెట్ లెక్కల్లో పరిగణనలోకి తీసుకోవడం జరిగింది. ఈ విధంగా సహజసిద్ధమైన భూగర్భ జలాల రీఛార్జ్ మరియు ఇతర నీటి సంరక్షణ అంశాలను కలిపి ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మొత్తం సుమారు 17.602 హెక్టార్ల మీటర్ల నీరు భూగర్భ జలాల రూపంలో నిల్వ ఉండేందుకు అవకాశం ఉందని అంచనా వేయడం జరిగింది. వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను మరింత అభివృద్ధి చేయడం ద్వారా భూగర్భ జలాల రీఛార్జ్‌ను పెంచుకోవచ్చని రైతులకు వివరించడం జరిగింది. తదుపరి ఖరీఫ్ సీజన్‌లో గ్రామ రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటల వివరాలను సేకరించి, వాటి విస్తీర్ణం మరియు నీటి అవసరాలను విశ్లేషించడం జరిగింది. ఈ వివరాల ప్రకారం వరి 0.79 హెక్టార్లు, మిరప 0.17 హెక్టార్లు, మొక్కజొన్న 0.95 హెక్టార్లు, కాకర 1.57 హెక్టార్లు, టమోటా 10 హెక్టార్లు, చిక్కుడు 1.44 హెక్టార్లు, వేరుశనగ 7.29 హెక్టార్లు, రాగులు 2.50 హెక్టార్లు, పశుగ్రాసం 0.27 హెక్టార్లు మరియు పూల పంటలు 4.01 హెక్టార్ల విస్తీర్ణంలో సాగు చేసినట్లు గుర్తించడం జరిగింది. ఈ విధంగా ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 28.99 హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలు సాగు చేసినట్లు క్రోడీకరించడం జరిగింది. ఈ పంటల సాగుకు సుమారు 13.59 హెక్టార్ల మీటర్ల నీరు అవసరమైందని అంచనా వేయడం జరిగింది. ముఖ్యంగా టమోటా, వేరుశనగ, పూలు మరియు కూరగాయల పంటల సాగులో నీటి అవసరాలను పరిశీలించడం జరిగింది. పంటల రకాన్ని బట్టి వాటికి అవసరమయ్యే నీటి పరిమాణం మారుతుందని, ఒకే రకమైన పంటలను అధిక విస్తీర్ణంలో సాగు చేయడం వల్ల భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉందని వివరించడం జరిగింది. అందువల్ల భూమి స్వభావం, వర్షపాతం, నీటి లభ్యత మరియు మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించడం జరిగింది. రబీ సీజన్‌కు సంబంధించి కూడా గ్రామంలో అందుబాటులో ఉండే వర్షపు నీరు, భూగర్భ జలాల రీఛార్జ్ మరియు పంటల సాగుకు అవసరమయ్యే నీటి పరిమాణాన్ని అంచనా వేయడం జరిగింది. రబీ సీజన్‌లో సుమారు 137 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసి, గ్రామంలోని మొత్తం 352 హెక్టార్ల భూ విస్తీర్ణంతో గణించగా సుమారు 48.224 హెక్టార్ల మీటర్ల వర్షపు నీరు లభ్యమవుతుందని గుర్తించడం జరిగింది. ఇందులో సుమారు 10 శాతం అనగా 4.822 హెక్టార్ల మీటర్ల నీరు సహజసిద్ధంగా భూమిలోకి ఇంకి భూగర్భ జలాలను పెంపొందిస్తుందని అంచనా వేయడం జరిగింది. దీనికి అదనంగా పంటల సాగు మరియు ఇతర నీటి సంబంధిత అంశాల ద్వారా సుమారు 0.142 హెక్టార్ల మీటర్ల నీరు భూమిలోకి ఇంకుతుందని లెక్కించడం జరిగింది. ఈ విధంగా రబీ సీజన్‌లో మొత్తం సుమారు 4.965 హెక్టార్ల మీటర్ల నీరు భూగర్భ జలాల రూపంలో నిల్వ ఉండవచ్చని అంచనా వేయడం జరిగింది. రబీ సీజన్‌లో రైతులు సుమారు 16.36 హెక్టార్ల విస్తీర్ణంలో వివిధ రకాల పంటలను సాగు చేయడానికి ప్రణాళిక రూపొందించుకోగా, వాటి సాగుకు సుమారు 2.849 హెక్టార్ల మీటర్ల నీరు అవసరమవుతుందని అంచనా వేయడం జరిగింది. ఖరీఫ్ సీజన్‌తో పోల్చినప్పుడు రబీ సీజన్‌లో వర్షపాతం తక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, పంటల సాగు నిర్ణయాలు తీసుకునేటప్పుడు భూగర్భ జలాల లభ్యతను తప్పనిసరిగా పరిగణనలోకి తీసుకోవాలని రైతులకు వివరించడం జరిగింది. ముఖ్యంగా రబీ పంటల సాగు ప్రారంభించే ముందు బోరు బావుల నీటి లభ్యతను పరిశీలించడం, అవసరానికి మించి సాగు విస్తీర్ణాన్ని పెంచుకోకుండా ఉండడం, తక్కువ నీటి అవసరమయ్యే పంటలను ప్రోత్సహించడం వంటి అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది.



నీటి బడ్జెట్ విశ్లేషణ మరియు గ్రామంలో నీటి లోటు పరిస్థితి:

ఈ కార్యక్రమంలో గత వ్యవసాయ సంవత్సరం ముగింపు నుంచి ప్రస్తుత 2026--2027 వ్యవసాయ సంవత్సరానికి సంబంధించిన ఖరీఫ్ మరియు రబీ సీజన్ల వరకు గ్రామంలోని నీటి నిల్వలు, నీటి లభ్యత మరియు నీటి వినియోగాన్ని సమగ్రంగా విశ్లేషించడం జరిగింది. గత 2025--2026 వ్యవసాయ సంవత్సరానికి సంబంధించిన రబీ సీజన్ ముగిసే సమయానికి గ్రామంలో సుమారు 8.952 హెక్టార్ల మీటర్ల నీటి లోటు బడ్జెట్ ఉన్నట్లు గుర్తించడం జరిగింది. ఈ గత లోటును ప్రస్తుత వ్యవసాయ సంవత్సరానికి ప్రారంభ నీటి పరిస్థితిగా పరిగణనలోకి తీసుకొని, ఖరీఫ్ సీజన్‌లో లభించే నీటి పరిమాణం మరియు జరిగే నీటి వినియోగాన్ని విశ్లేషించడం జరిగింది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో వర్షపాతం మరియు ఇతర నీటి సంరక్షణ అంశాల ద్వారా సుమారు 17.602 హెక్టార్ల మీటర్ల నీరు భూగర్భ జలాల్లోకి చేరుతుందని అంచనా వేయగా, వ్యవసాయ అవసరాలు మరియు ఇతర వినియోగాలకు కలిపి సుమారు 15.942 హెక్టార్ల మీటర్ల నీరు వినియోగమవుతుందని లెక్కించడం జరిగింది. ఈ వివరాలను గత సంవత్సరం నుంచి కొనసాగుతున్న నీటి లోటుతో కలిపి పరిశీలించినప్పుడు ఖరీఫ్ సీజన్ ముగిసే సమయానికి సుమారు 7.293 హెక్టార్ల మీటర్ల నీటి లోటు బడ్జెట్ ఉన్నట్లు నీటి బడ్జెట్ విశ్లేషణలో నమోదు చేయడం జరిగింది. అదేవిధంగా రబీ సీజన్‌కు సంబంధించి అంచనా వేసిన 4.965 హెక్టార్ల మీటర్ల నీటి రీఛార్జ్‌ను, పంటల సాగు మరియు ఇతర అవసరాలకు అంచనా వేసిన 2.848 హెక్టార్ల మీటర్ల నీటి వినియోగాన్ని పరిగణనలోకి తీసుకొని, గత లోటుతో కలిపి గ్రామంలోని నీటి పరిస్థితిని విశ్లేషించడం జరిగింది. ఈ లెక్కల ప్రకారం రబీ సీజన్ ముగిసే సమయానికి యర్రగుంట్లపల్లి గ్రామంలో సుమారు 5.176 హెక్టార్ల మీటర్ల నీటి లోటు బడ్జెట్ కొనసాగుతుందని అంచనా వేయడం జరిగింది. ఈ నీటి బడ్జెట్ విశ్లేషణ ద్వారా గ్రామంలో వర్షపాతం ద్వారా లభించే నీరు మరియు భూగర్భ జలాల రీఛార్జ్ ఉన్నప్పటికీ, వ్యవసాయ అవసరాలు మరియు ఇతర వినియోగాల కారణంగా నీటి వనరులపై ఒత్తిడి కొనసాగుతున్నట్లు రైతులకు తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా భూగర్భ జలాలను నిరంతరం వినియోగించడం వల్ల బోరు బావుల్లో నీటి మట్టాలు తగ్గే ప్రమాదం ఉందని, అందువల్ల నీటి వినియోగంపై సామూహిక బాధ్యత అవసరమని వివరించడం జరిగింది. గ్రామంలో నీటి లోటు బడ్జెట్ ఉన్న పరిస్థితిని రైతులు స్వయంగా అర్థం చేసుకునేలా సమావేశంలో అందుబాటులో గ్రామస్థాయిలో నీటి వినియోగంపై నియంత్రణ ఏర్పరచుకోవడం, పంటల సాగు విధానాల్లో మార్పులు తీసుకురావడం మరియు రైతుల మధ్య నీటి భాగస్వామ్యాన్ని పెంపొందించడం సాధ్యమవుతుందని వివరించడం జరిగింది. ముఖ్యంగా బోరు బావుల ద్వారా నీరు లభించే రైతులు తమ నీటి వినియోగాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించడంతో పాటు, నీటి కొరత ఎదుర్కొంటున్న ఇతర రైతుల పట్ల సహకార ధోరణితో వ్యవహరించాలని సూచించడం జరిగింది. బోరు బావులు కలిగిన రైతులు మరియు బోరు బావులు లేని రైతుల మధ్య సమన్యాయంతో నీటి వినియోగం జరిగేలా గ్రామస్థాయిలో పరస్పర అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరాన్ని తెలియజేయడం జరిగింది.

రైతుల నీటి వినియోగ కట్టుబాట్లు మరియు భవిష్యత్ కార్యాచరణ:

నీటి బడ్జెట్ విశ్లేషణలో గ్రామానికి నీటి లోటు ఉన్నట్లు గుర్తించిన నేపథ్యంలో, రైతులు స్వచ్ఛందంగా కొన్ని ముఖ్యమైన నీటి వినియోగ కట్టుబాట్లను పాటించాలని సమావేశంలో చర్చించి నిర్ణయించుకోవడం జరిగింది. అందులో భాగంగా అందుబాటులో ఉన్న భూగర్భ జలాలను విచక్షణారహితంగా వినియోగించకుండా, అవసరానికి అనుగుణంగా పొదుపుగా ఉపయోగించాలని నిర్ణయించడం జరిగింది. నీటి లభ్యతను ముందుగానే అంచనా వేసుకొని, దానికి అనుగుణంగానే పంటల సాగు విస్తీర్ణాన్ని నిర్ణయించుకోవాలని రైతులు అంగీకరించడం జరిగింది. అధిక నీటి అవసరం ఉన్న పంటల సాగును సాధ్యమైనంతవరకు పరిమితం చేసి, తక్కువ నీటితో పండించే చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు మరియు ఇతర ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని చర్చించడం జరిగింది. అదేవిధంగా పొలాల్లో బిందు సేద్యం, తుంపర సేద్యం వంటి సూక్ష్మ నీటిపారుదల పద్ధతులను అనుసరించడం ద్వారా నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచుకోవాలని సూచించడం జరిగింది. నీటి మడుగులు మరియు ఇతర నీటి సంరక్షణ నిర్మాణాలను ఏర్పాటు చేసుకోవడం, ఇప్పటికే ఉన్న నిర్మాణాలను శుభ్రపరిచి వాటి సామర్థ్యాన్ని పెంచుకోవడం, నీరు భూమిలోకి ఇంకే అవకాశాలను మెరుగుపరచడం వంటి అంశాలను రైతుల దృష్టికి తీసుకురావడం జరిగింది. గ్రామంలోని యర్రగుంట్లపల్లి కుంట మరియు కనికలమ్మ కుంటల నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టడం, వర్షపు నీటిని సమర్థవంతంగా నిల్వ చేసుకోవడం మరియు భూగర్భ జలాల రీఛార్జ్‌ను పెంచే పనులకు గ్రామస్థాయి భాగస్వామ్యాన్ని పెంపొందించడం అవసరమని వివరించడం జరిగింది. అలాగే గ్రామంలో ఎంపిక చేసిన బోరు బావుల ద్వారా భూగర్భ జలాల స్థాయిని క్రమం తప్పకుండా పరిశీలించడం, నీటి మట్టాల్లో వచ్చే మార్పులను నమోదు చేయడం మరియు వాటి ఆధారంగా తదుపరి పంటల సాగు ప్రణాళికను రూపొందించుకోవడం వంటి చర్యల ప్రాముఖ్యతను తెలియజేయడం జరిగింది. రైతుల మధ్య నీటి భాగస్వామ్యం మరియు పరస్పర సహకారాన్ని బలోపేతం చేయడం కూడా ఈ కార్యక్రమంలో ప్రధానంగా చర్చించిన అంశాలలో ఒకటిగా నిలిచింది. ముఖ్యంగా బోరు బావులు కలిగిన రైతులు తమకు అందుబాటులో ఉన్న నీటిని అవగాహన పెంపొందించుకోవాలని సూచించడం జరిగింది. నీటి వినియోగంలో అనవసరమైన పోటీని తగ్గించి, గ్రామంలోని అందరికీ వ్యవసాయ అవసరాలకు అనుగుణంగా నీరు అందుబాటులో ఉండేలా పరస్పర అవగాహనతో వ్యవహరించాలని రైతులు చర్చించడం జరిగింది. ఈ విధమైన సామూహిక కట్టుబాట్లు గ్రామంలో నీటి వనరుల సంరక్షణకు మాత్రమే కాకుండా రైతుల మధ్య ఐక్యత, సహకారం మరియు సామాజిక బాధ్యతను కూడా పెంపొందిస్తాయని తెలియజేయడం జరిగింది. భూ విస్తీర్ణం, జనాభా, పశుసంపద, ఖరీఫ్ మరియు రబీ సీజన్ల వర్షపాతం, భూగర్భ జలాల రీఛార్జ్, ఉపరితల నీటి నిల్వలు, పంటల సాగు విస్తీర్ణం మరియు నీటి వినియోగానికి సంబంధించిన వివరాలను సమగ్రంగా తెలుసుకోవడం జరిగింది. ఎలాంటి చర్యలు తీసుకోవాలో రైతులు చర్చించడం జరిగింది. పంట నీటి ప్రణాళిక అనేది కేవలం గణాంకాల సేకరణకు పరిమితం కాకుండా, గ్రామంలోని ప్రతి రైతు నీటి వనరుల ప్రాముఖ్యతను గుర్తించి, బాధ్యతాయుతమైన వ్యవసాయ నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సహించే ఒక ముఖ్యమైన సామూహిక ప్రక్రియ అని తెలియజేయడం జరిగింది. గ్రామంలోని సహజ వనరులను సంరక్షించుకోవడం, వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చేయడం, భూగర్భ జలాలపై ఒత్తిడిని తగ్గించడం మొత్తంగా, యర్రగుంట్లపల్లి గ్రామంలో నిర్వహించిన ఈ 2026--2027 సంవత్సరపు పంట నీటి ప్రణాళిక కార్యక్రమం ద్వారా రైతుల్లో నీటి వనరులపై అవగాహన పెంపొందించడంతో పాటు, నీటి లభ్యత మరియు వినియోగం మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించే అవకాశం కల్పించడం జరిగింది. గ్రామ రైతులు స్వచ్ఛందంగా నీటి వినియోగ కట్టుబాట్లను రూపొందించుకోవడం, పంటల ఎంపికలో నీటి లభ్యతకు ప్రాధాన్యత ఇవ్వడం, వర్షపు నీటి సంరక్షణ చర్యలను ప్రోత్సహించడం మరియు బోరు బావులు కలిగిన రైతులు, బోరు బావులు లేని రైతుల మధ్య పరస్పర సహకారాన్ని పెంపొందించుకోవడం వంటి అంశాలపై ఏకాభిప్రాయానికి రావడం ఈ కార్యక్రమంలో ముఖ్యమైన ఫలితంగా నిలిచింది. జనజాగృతి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో సమగ్ర నీటి నిర్వహణకు రైతుల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం మరియు భవిష్యత్తు తరాలకు నీటి వనరులను సంరక్షించాలనే బాధ్యతను పెంపొందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనజాగృతి సంస్థ సిబ్బంది శ్రీనివాసులు రెడ్డి, గంగాధర్ రెడ్డి, చంద్రమోహన్, హరికృష్ణ,గరుడప్ప తదితరులు పాల్గొన్నారు.

లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అరుదైన రక్తం ఓ నెగిటివ్ రక్తదానం చేసిన మనోజ్ కుమార్ రెడ్డి



గుంతకల్ నవంబర్ 13 సీమా వార్త శుక్రవారం గుంతకల్లు పట్టణంలోని గవర్నమెంట్ హాస్పిటల్ నందు డెలివరీ సులోచన అనే పేషెంట్ కు అరుదైన రక్తం ఓ నెగటివ్ రక్తం అవసరం కాగా,గుంతకల్లు లైవ్ లెజెండ్ బ్లడ్ ఆర్గనేషన్ అధ్యక్షుడు రంజాన్ ని సంప్రదించగా రక్తదాత గుంతకల్లు అరుదైన రక్తం ఓ నెగటివ్ మనోజ్ కుమార్ రెడ్డి కి సమాచారం ఇవ్వగా అతను వెంటనే స్పందించి గోపి బ్లడ్ బ్యాంక్ కి వచ్చి రక్తదానం చేశాడు రక్తదానం చేసిన మనోజ్ కుమార్ రెడ్డి కిమా లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ తరపున నిండు నూరేళ్లు ఆయుష్ ఆరోగ్యం బాగుండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా,ఈ సందర్భంగా లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు రంజాన్ మాట్లాడుతూ, ఈరోజు తో మనోజ్ కుమార్ రెడ్డి 12పసారి రక్తదానం చేశారని, ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని, మీరు చేసే రక్తదానం ఒక నిండు ప్రాణాన్ని కాపాడుతుందని, పిలిచిన వెంటనే సంస్థ ద్వారా రక్తదానం చేయడానికి వస్తున్న ప్రతి ఒక్క రక్తదాతకు పాదాభివందనమని తెలియజేశారు.

ఆక్రమణపై తహశీల్దార్‌కు ఫిర్యాదు



టి. సుండుపల్లె నవంబర్ 13సీమ వార్త మండలంలోని తొట్టికాడపల్లె, బాపనపల్లె గ్రామాల సమీపంలో ఉన్న యల్లమ్మ గుడి భూమిని కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్తులు తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అడ్డుకున్న తమను బెదిరిస్తూ, గుడిని కూల్చివేస్తామని హెచ్చరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు విచారం చేపట్టి ఆలయ భూమిని గుడి పేరుతో ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని గ్రామస్తులు నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలోబిజెపి మండల కార్యదర్శి మనిగుంటి నాగేశ్వరరావు,రమేష్, రామాంజులు, రామ్మోహన లక్ష్మమయ్య, మహాదేవ,మణికంఠ,నాగరాజ,మనోహర్,యల్లయ్య వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పసికందు ప్రాణాలు కాపాడిన డాక్టర్




టి సుండుపల్లి నవంబర్ 13సీమ వార్త మండలంలోని బెస్తపల్లెకు చెందిన 11 రోజుల పసికందుకు పాలు తాగే సమయంలో ఊపిరి ఆడకపోవడంతో కుటుంబ సభ్యులు సుండుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంటనే స్పందించిన డాక్టర్ దిలీప్ గుప్తా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు పంపించారు. అక్కడ చికిత్స అనంతరం పసికందు ప్రాణాపాయం నుంచి బయటపడటంతో కుటుంబ సభ్యులు డాక్టర్ దిలీప్ గుప్తాకు కృతజ్ఞతలు తెలిపారు.

దైవ సన్నిధిలో... పేద జనానికి ఉచిత వైద్యం.

.....శ్రీమారెమ్మ దేవాలయం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరంకు భారీ స్పందన.

.... పాల్గొన్న ఆలయ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దేవిస్వామి.





గోరంట్ల నవంబర్ 13 సీమ వార్త గోరంట్ల పట్టణ పరిధిలో ఉన్న గుమ్మయ్య గారి పల్లి గ్రామంలో వెలసిన పురాతన శ్రీ మారెమ్మ దేవి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దేవి స్వామి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరానికి తిరుపతికి చెందిన మాధురి రెమిడి హాస్పిటల్ వైద్య సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి హాజరైన ప్రజలకు డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి కచ్చితంగా మందులు పంపిణీ చేశారు. అంతేకాకుండా అవసరమైన వారికి మాధురి రెమిడీ హాస్పిటల్ వారు ఉచిత వైద్య పరీక్షలు అనంతరం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దాదాపు 50 మందిని తిరుపతి ఆస్పత్రికి ఉచితంగా తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా డాక్టర్ దేవి స్వామి మాట్లాడుతూ తిరుపతికి చెందిన మాధురి రెమిడీ హాస్పిటల్ వారు మారెమ్మ దేవి ఆలయానికి వచ్చి ఇక్కడ చుట్టుపక్కల ప్రజలకు సేవే మార్గంగా అనారోగ్యాలతో ఉన్న ప్రజలకు మెరుగైన వైద్యం కోసం ఇంత దూరం వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించడం చాలా సంతోషమని. ఇక్కడ మెరుగైన వైద్యం కోసం వెళ్లిన ప్రతి ఒక్కరికి అక్కడ వైద్య పరీక్షలతో పాటు అవసరమైన రక్త పరీక్షలు. స్కానింగ్ . ఎక్సరేలు చూసి వాటి కనుగొనంగా వైద్య పరీక్షలు చేసి మూడు రోజుల తర్వాత తమ గ్రామాలకు తీసుకువచ్చి వదిలిపెడతారన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రామ్మోహన్ రెడ్డి .పుటక శంకర. సాయినాథ్ రెడ్డి. మాధురి రెమిడి హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆంధ్ర సరి హద్దు లో.... కోట్ల ఖర్చుతో... కోటేశ్వరం హోటల్.

....కోడికొండ చెక్‌పోస్టు వద్ద కోటేశ్వరం హోటల్స్ పరిశ్రమ ప్రారంభం.

... భూమి పూజ నిర్వహించిన... పారిశ్రామికవేత్త సుదర్శన్ శర్మ.

రూ.10 కోట్ల వరకు పెట్టుబడి.. 350 మందికి ఉపాధి అవకాశాలు





గోరంట్ల నవంబర్ 13 సీమ వార్త గోరంట్ల మండలం కోడికొండ చెక్‌పోస్టు వద్ద కోటేశ్వరం హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హోటల్ పరిశ్రమను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ హెమ్మనూరు సుదర్శన్ శర్మ, నంజుండ శర్మ,జై శ్రీ, డాక్టర్ విష్ణు, ఉదయ్, యండి కోటేశ్వరం, ఘనశ్యామ్ ఎక్స్‌పోర్ట్ అండ్ డైరెక్టర్ కోటేశ్వరం హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్, భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 350 మందికి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భూమి ఖర్చు మినహాయించి ఈ ప్రాజెక్టు నిర్మాణం, ఏర్పాట్లకు సుమారు రూ.7.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో అతిపెద్ద హోటల్ పరిశ్రమగా దీనిని అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు. ఈ పరిశ్రమ అందుబాటులోకి వస్తే స్థానిక ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలకు ఊతం లభించనుంది. ఈ కార్యక్రమంలో హెమ్మనూరు సుదర్శన శర్మ, ఎన్ జయశ్రీ హెమ్మాస్ట్ డైరెక్టర్స్, నంజుండ శర్మ, విష్ణు గౌడ, డాక్టర్ విష్ణు కృపాడ్ , కోటేశ్వరం సంస్థ ఎం.డీ. ఉదయ్, బాలచంద్ర నాయక్, హిందూపురం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్, సింగిల్ విండో డైరెక్టర్ వెంకటకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మదన్‌మోహన్ రెడ్డి, అజీమ్ సాబ్, సమీయుల్లా, గోరంట్లకు చెందిన కరణం ప్రభాకర్, నరసింహమూర్తి, రాజశేఖర్, కనిశెట్టి పల్లి, చిల్లమత్తూరు మండల బీజేపీ ఉపాధ్యక్షుడు హరి రెడ్డి, మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు హర్షస్వామి, వానవోలు సుబ్రహ్మణ్యస్వామి, శీనప్ప, బాబు, జమా సాబ్, శివప్రసాద్, కొడికొండ ప్రభాకర్ స్వామి, గోరంట్ల నరసింహమూర్తి, వెంకటకృష్ణ బిజెపి జిల్లా బీసీ ప్రెసిడెంట్, వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు బాబే నాయక్ తదితరులు పాల్గొన్నారు.

దాన గుణంతోనే... మానవత్వానికి విలువ.

....పాలసముద్రం మోడల్ ప్రాథమిక పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం.



గోరంట్ల నవంబర్ 13 సీమ వార్త గోరంట్ల మండలం పాలసముద్రం మోడల్ ప్రాథమిక పాఠశాలలో దాన ఉపాధ్యాయులు నీలం అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి స్థానిక దాత సి.వి. బాలరాజు దంపతులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత భాగాన్ని దానధర్మాలకు కేటాయించాలని, దాన గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో చిన్నతనం నుంచే సేవాభావం, దాతృత్వ గుణాలను పెంపొందించేలా ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా కృషి చేయాలని కోరారు. అనంతరం బాలరాజు దంపతులు విద్యార్థులకు స్వీట్లు, బహుమతులు అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు చీరలు, షర్టులతో పాటు స్వీట్లు పంపిణీ చేశారు. గతంలో పాఠశాలలో డైనింగ్ హాల్‌కు షెడ్డు నిర్మిస్తానని ఇచ్చిన హామీ మేరకు, ఈ సమావేశంలో సభ్యులందరి సమక్షంలో రెండు రోజుల్లో నిర్మాణ సామగ్రిని అందిస్తానని బాలరాజు తెలిపారు. ఇందుకోసం కాంట్రాక్టర్‌కు రూ.10 వేల అడ్వాన్స్ కూడా అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు బాలరాజు దంపతులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయచంద్ర నాయక్, నాగలీల, సునంద, సంప్రీతి బాయి, పాఠశాల చైర్మన్ సురేష్, వైస్ చైర్మన్ వెంకట సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై... గోరంట్ల జన సైన్యం దృష్టి.

....గోరంట్ల పట్టణం -- 2వ వార్డు వడ్డివారి వీధిలో ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయి పర్యటన.



గోరంట్ల నవంబర్ 13 సీమ వార్త గోరంట్ల పట్టణంలోని రెండవ వార్డు, వడ్డివారి వీధిలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని స్థానిక కాలనీవాసులు జడ్పీటీసీ సునేత్ర అనిల్ కుమార్ యాదవ్ దృష్టికి తీసుకువచ్చారు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి, ఇళ్ల పరిసరాల్లోకి చేరుతూ స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని తెలుసుకున్న జడ్పీటీసీ అనిల్ కుమార్ యాదవ్ వెంటనే ఆ ప్రాంతాన్ని సందర్శించి, ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు.అనంతరం సంబంధిత అధికారులకు సమస్యను వివరించి, డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించే విధంగా కృషి చేస్తానని స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు సంతోష్, ఎంపీటీసీ ఈశ్వర్, మండల నాయకులు నాగేష్, తిరుపాల్, రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.ప్రజల సమస్యలే ప్రాధాన్యం... ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయడమే లక్ష్యం అని వారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మల్లాపల్లి ఎంపీటీసీ భారతి .... ప్రజా సమస్యలపై స్పందన.

గోరంట్ల నవంబర్ 13 సీమ వార్త ప్రజల చేత ఎన్నుకోబడిన వెంటనే ఆ ప్రజల కోసం ఏదో చేయాలని దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలు తీర్చాలని ప్రజల అభ్యర్థుల మేరకు ప్రజాక్షేత్రంలో రైతుల సమస్యల పరిష్కారం కోసం నేనున్నానంటూ ముందుకొచ్చి సమస్యలు పరిష్కరిస్తుంది టిడిపి మండల నేత పేయ్యాల పెయ్యాల వెంకటరెడ్డి భార్య మల్లపల్లి ఎంపీటీసీ భారతి. మల్లాపల్లి గ్రామపంచాయతీ కేంద్రం నుంచి పొలాలకు వెళ్లడానికి ఉన్న ప్రధాన రహదారి ముళ్ళకంపలతో నిండిపోయిందని మీరేనా చొరవ తీసుకొని ఆ ముళ్ళకంపలు తొలగించాలని గ్రామస్తులు టిడిపి నేత వెంకటరెడ్డి మరియు ఎంపీటీసీ భారతీని గ్రామస్తులు కోరారు. వెంటనే స్పందించిన ఆ ఇద్దరూ సొంత ఖర్చులతో యుద్ధ ప్రాతిపదికన రోడ్డు మరమ్మతు పనులు వేగవంతంగా నిర్వహించి ప్రజల మన్ననలు పొందారు.

ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహణ



ధర్మవరం రూరల్ నవంబర్ 13 సీమ వార్త : ఎన్నికల కమిషన్ ఆదేశాను ప్రకారం డివిజనల్ స్థాయిలో ఆర్డీవో రామ్ భూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో 6 తరగతి నుండి డిగ్రీ చదువుతున్నటువంటి విద్యార్థిని, విద్యార్థులకు ఎన్నికల విధానంపై అవగాహన చైతన్యం కల్పించుటకు ఎస్సే రైటింగ్ మరియు క్విజ్ పోటీలను నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా ఆర్డీవో రాంభూపాల్ రెడ్డి,ఎ.ఓ.ఖదీజిన్ కుప్రా,ఎంఈఓ పి రాజేశ్వరి,ఎంఈఓ గోపాల్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ప్రజాస్వామ్యం లో ఎన్నికల విధానంపై అవగాహన కలిగి ఉండాలని మన రాజ్యాంగం పట్ల ప్రజాస్వామ్యం పట్ల విశ్వాసం కలిగి ఉండాలని ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలు పరిష్కరించాలని ప్రజాసంపట్ల ప్రగాఢ విశ్వాసం కలిగి ఉండాలని విద్యార్థులకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజనల్ స్థాయిలో ఉన్నటువంటి ఉన్నత పాఠశాల విద్యార్థులు, జూనియర్ కాలేజ్ విద్యార్థులు, డిగ్రీ కాలేజ్ విద్యార్థులు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇంద్రమ్మ కాలనీ హెడ్మాస్టర్ ఇతర పాఠశాల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఆర్డిఓ కార్యాలయం సిబ్బంది పాల్గొనడం జరిగింది.

ధర్మవరం మండలం లో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ కేంద్రాల వివరాలు



ధర్మవరం రూరల్ నవంబర్ 13 సీమ వార్త : గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు మరియు వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ కోసం ధర్మవరం మండలంలో ఏర్పాట్లు చేసిన నామినేషన్ కేంద్రాలు మరియు వాటి పరిధిలోని గ్రామాల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:ఎంపీడీవో కార్యాలయం, ధర్మవరం కేంద్రం:కునుతూరు, పొతుకుంట, సీసీ కొత్తకోట, పోతుల నాగేపల్లి రేగాటిపల్లి,దర్శనమల సచివాలయం: లో లిదర్శనమల, నేలకోట, నెలకోట తండా,ఏలుకుంట్ల ధర్మపురి సచివాలయం లో పరిధిలోని గ్రామాలు: ధర్మపురి, రావులచెరువు, వెంకటతిమ్మాపురం, మల్లా కాలువ తుమ్మల సచివాలయంలోలి పరిధిలోని గ్రామాలు: తుమ్మల గొట్లూరు, సుబ్బారావుపేట. బడన్నపల్లి సచివాలయం లో పరిధిలోని గ్రామాలు: బడన్నపల్లి, ఉప్పనేసినపల్లి, చిగిచెర్ల, చింతలపల్లి, మల్కాపురం లలోని సచివాలయాలలో నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని అధికారులు తెలిపారు.సంబంధిత అభ్యర్థులు ఈ వివరాలను గమనించి, నిర్దేశిత కేంద్రాలలో నామినేషన్లు దాఖలు చేయాలని అధికారులు సూచించారు.

స్కూల్ పరిసరాల్లో స్వచ్ఛతా శ్రమదానం

డ్రైడే డ్రైడే లో పాల్గొన్న కౌన్సిలర్లు, నాయకులు



తాడిపత్రి, నవంబర్ 13 సీమ వార్త: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టంకంగా చేపట్టిన డ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం 41వ వార్డు మరియు 42వ వార్డులలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నందలపాడులోని అబ్దుల్ కలాం అప్పర్ ప్రైమరీ స్కూల్ చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రం చేశారు. స్కూల్ ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను శుభ్రం చేశారు. వార్డుల్లోని డ్రైనేజీలు, ఖాళీ స్థలాల్లో కూడా పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. స్కూల్ పిల్లలకు దోమల వల్ల వచ్చే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం ఇంటి చుట్టూ నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కౌన్సిలర్లు ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశుభ్రతే ఆరోగ్యానికి మూలమని, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో 41వ వార్డు కౌన్సిలర్ దిద్దకుంట రాణి, 42వ వార్డు కౌన్సిలర్ మెహర్ హుస్సేన్, సచివాలయ సిబ్బంది షబ్నం, మురళి, వెంకట్, కవిత, ఆశా వర్కర్ వెంకటలక్ష్మి, యూనిట్ ఇంచార్జ్ పావురాల శీనయ్య, సింగిల్ విండో డైరెక్టర్ కె.వి.ఎన్. రెడ్డి (రాజారెడ్డి), స్టోర్ డీలర్ పుల్లయ్య, కె.ఎస్.ఎస్. కన్వీనర్ రాజేష్, తెలుగుదేశం నాయకులు మధు, మౌళి, దొరస్వామి, దేవపుత్ర, భైరవ, హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతతో ఆరోగ్య తాడిపత్రి శ్రీరాములపేటలో శ్రమదానం చేసిన నాయకులు



తాడిపత్రి, నవంబర్ 13 సీమవార్త: తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు శ్రీరాములపేటలో శుక్రవారం డ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి మరియు జేసీ ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ మరియు ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రజల ఆరోగ్యమే ప్రథమ ప్రాధాన్యతగా భావిస్తూ నిరంతరం ప్రజాసేవలో ముందుకు సాగాలని ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి సూచించినట్లు నాయకులు తెలిపారు. వార్డులోని ప్రధాన వీధులు, డ్రైనేజీలు, ఖాళీ స్థలాలు, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను శుభ్రం చేశారు. డెంగ్యూ, మలేరియా వంటి దోమల వల్ల వచ్చే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటి ముందు పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కౌన్సిలర్ కొట్టే విజయ్ కుమార్ ప్రజలకు పిలుపునిచ్చారు. వచ్చే శుక్రవారం కూడా ఇదే విధంగా డ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. పరిశుభ్రతతోనే ఆరోగ్యవంతమైన తాడిపత్రిని నిర్మించగలమని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ శ్రీరాముల పేట యువ నాయకుడు శైలేందర్ రెడ్డి, ఎర్రంశెట్టి రామాంజనేయులు, స్టోర్ ప్రసాద్, రాజేష్, తెలుగుదేశం కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోవిందప్పను పరామర్శించిన... నిమ్మల శ్రీధర్ బృందం.



గోరంట్ల నవంబర్ 13 సీమ వార్త. గోరంట్ల మండలం సీనపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీకార్యకర్త గోవిందప్ప కు అనంతపురం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి లో వెన్నెముక ఆపరేషన్ చేయించుకున్న గోవిందప్ప ను పరామర్శించన నిమ్మల శ్రీధర్. రవి మోహన్. మహేంద్ర. శ్రీనివాసులు కలిసి గోవిందప్ప కు ధైర్యం చెప్పి తెలుగుదేశం పార్టీ మీ కుటుంబానికి అండగా ఉంటుందని అభయమిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల జోలికి వెళ్ళని విద్యార్థుల భవిష్యత్తు బంగారం

ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు



ధర్మవరం నవంబర్ 13 సీమ వార్త : మాదక ద్రవ్యాల నివారణ చర్యలో భాగంగా ధర్మవరం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు ధర్మవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల యందు విద్యార్థులకు డ్రగ్స్ నివారణ సూచనలు తెలుపుతూ డ్రగ్స్ ఉపయోగిస్తే విద్యార్థుల యొక్క బంగారు భవిష్యత్ అంధకారం అవుతుంది, ఉద్యోగ అవకాశాలు కోల్పోతారు అదే విధంగా పై చదువుల కోసం విదేశాల వెళ్లే వారు పాస్ పోర్ట్ ను రద్దు చేస్తారు అని విద్యార్థులకు తెలిపారు.అదేవిధంగా విద్యార్థులపై ఒక్కసారి ఇలాంటి మారక ద్రవ్యాల విషయంలో ఎఫ్ఐఆర్ నమోదు అయితే మీ యొక్క భవిష్యత్తును మీరే సర్వ నాశనం చేసుకున్న వారు అవుతారు అని తెలియజేశారు. కావున దయచేసి విద్యార్థులు ఎటువంటి చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా ఉండాలని మరియు మీ చుట్టూ పరిసరాల ప్రాంతంలో ఎవరైనా డ్రగ్స్ వ్యవహారాలు నిర్వహిస్తూ ఉన్నట్లు మీరు చూసినచో టోల్ ఫ్రీ నెంబర్ 14405 కు డైల్ చేయండి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు, ధర్మవరం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ నాగరాజు మరియు సిబ్బంది పాల్గొన్నారు అని ఇన్స్పెక్టరు చంద్రమణి తెలిపారు.

పల్లె కోటరీ లోకి.. గ్యాస్ సూరి జాయిన్.

.....మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో డి సూర్యనారాయణ రెడ్డి

... పల్లె రఘునాథ్ రెడ్డి నల్లమాడ మేజర్ సర్పంచ్ అభ్యర్థిగా సూర్యనారాయణ రెడ్డి (హెచ్.పీ గ్యాస్ సూరి) నీ ప్రకటించారులి

.....నల్లమాడ టిడిపి సర్పంచ్ అభ్యర్థిగా డి సూర్యనారాయణ రెడ్డి(హెచ్.పీ గ్యాస్ సూరిలి)

.....హెచ్.పీ గ్యాస్ సూరి ఎంపిక పట్ల హర్షం వ్యక్తం చేస్తున్న నల్లమాడ తెలుగుదేశం నాయకులు





నల్లమడ నవంబర్ 13 సీమ వార్త. నల్లమాడ మండల కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా ప్రజలకు సేవ చేస్తూ హెచ్ పి గ్యాస్ ఏజెన్సీ తీసుకొని నల్లమాడ మండల పరిధిలో తన వంతు ప్రజా సేవ చేస్తూ ప్రజలు అందుబాటులో ఉంటూ ప్రత్యేకంగా జీవించే వ్యక్తి డి సూర్యనారాయణ రెడ్డి మండల పరిధిలో మంచి పేరున్న నాయకుడు. నల్లమాడ మండల పరిధిలోని సర్పంచు అభ్యర్థుల ఎంపిక జాబితా ప్రకటించడం జరిగినది, స్థానికంగా నల్లమాడ మేజర్ సర్పంచ్ అభ్యర్థిగా సూర్యనారాయణ పేరును ప్రకటించడం సంచలనంగా మారింది , హెచ్.పీ గ్యాస్ సూరి నీ నల్లమాడ సర్పంచ్ అభ్యర్థిగా ప్రకటించడం పట్ల స్థానిక నాయకులు సంతోషంతో వ్యక్తం చేస్తున్నారు. అలాగే బాసం వారి పల్లెకు చెందిన నల్ల మాడ 2 అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప మెజారిటీతో ఓడిపోయిన రాంప్రసాద్ బంధువులు తెలుగుదేశం పార్టీలోకి చేరిన కుంచపు దాసప్ప, కిష్టప్ప, ఎం గోపాల్, రాములమ్మ, సాయిమ్మ, చెన్నప్ప, రాములమ్మ గోపాలు తదితరులకు డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి గారు పసుపు కండువా చేసి తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు మండల కన్వీనర్ మైలే శంకర్, హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు, బి కె కేశవరెడ్డి, సలాం ఖాన్, పెద్దప్పయ్య నాయుడు, గన్ రెడ్డి, రమణారెడ్డి, మైలే రామచంద్ర, బాబావలి, రాజారెడ్డి, కేశవులు, నాగే నాయక్, నల్లమాడ 2 అభ్యర్థి రాంప్రసాద్, ఫకీర్ నాయక్, గంగులప్ప, పల్లపు శ్రీరాములు, రెడ్డిపల్లి నాయుడు, ఎం చిన్నారెడ్డి, మణి కుమారి, ఎంపీటీసీ చినబాబు, రషీద్ ఖాన్, నరసింహులు, లక్ష్మన్న, ఈశ్వరయ్య, కృష్ణయ్య, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలు పాల్గొన్నారు.

జతిన్ ఆస్పత్రిలో... క్యాష్‌లెస్ సేవలు.

32 ఆరోగ్య బీమా సంస్థలు, టీపీఏలతో ఒప్పందం.

బీమా పాలసీదారులకు నగదు రహిత వైద్య చికిత్స -డాక్టర్ ఎం. వెంకటరమణ.

హిందూపురం: నవంబర్ 13 సీమ వార్త. అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైద్య ఖర్చుల కోసం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అండగా నిలిచేందుకు హిందూపురంలోని జతిన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి మరో కీలక ముందడుగు వేసింది. ఆస్పత్రిలో ఆరోగ్య బీమా కలిగిన వారికి నగదు రహిత వైద్య చికిత్స (క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్) సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఎం. వెంకటరమణ నాయక్ వెల్లడించారు. ప్రస్తుతం రోజురోజుకూ వైద్య చికిత్సల ఖర్చులు పెరుగుతున్నాయని, ముఖ్యంగా అత్యవసర వైద్య పరిస్థితులు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు చికిత్స కోసం పెద్ద మొత్తంలో డబ్బులు సమకూర్చుకోవాల్సిన పరిస్థితి ఉంటోందన్నారు. ఆరోగ్య బీమా పాలసీలు ఉన్నప్పటికీ, నగదు చెల్లించి చికిత్స పొందిన తర్వాత బీమా మొత్తాన్ని తిరిగి పొందే ప్రక్రియలో కొంత సమయం, ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో రోగులకు మరింత సౌకర్యవంతంగా వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో తమ ఆస్పత్రిలో క్యాష్‌లెస్ వైద్య సదుపాయాన్ని ప్రారంభించినట్లు వివరించారు. ఈ సదుపాయం కోసం దేశంలోని ప్రముఖ ఆరోగ్య బీమా సంస్థలు, థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్లతో (టీపీఏ) కలిపి మొత్తం 32 సంస్థలతో ఆస్పత్రి అనుసంధానం చేసుకున్నట్లు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో, స్టార్ హెల్త్, యునైటెడ్ హెల్త్‌కేర్, ఎల్ఐసీ, బజాజ్ అలియాంజ్, న్యూ ఇండియా




అస్యూరెన్స్, ఓరియంటల్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ లాంబార్డ్, రిలయన్స్ జనరల్ ఇన్సూరెన్స్, చోళ ఎంఎస్, డిజిట్, టాటా ఏఐజీ, లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్, రాయల్ సుందరం, యూనివర్సల్ సోంపో, మాగ్మా హెచ్‌డీఐ, భారతి ఏఎక్స్ఏ, ఎడెల్‌వైస్, శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్, కోటక్ జనరల్ ఇన్సూరెన్స్, ఫ్యూచర్ జనరలి, అకో, మణిపాల్‌సిగ్నా, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్, అపోలో మ్యూనిక్, రిలిగేర్ తదితర సంస్థలతో పాటు పలు టీపీఏల సేవలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. క్యాష్‌లెస్ వైద్య విధానం ద్వారా అర్హత కలిగిన బీమా పాలసీదారులు చికిత్స పొందే సమయంలో ఆస్పత్రి, సంబంధిత బీమా సంస్థ లేదా టీపీఏ మధ్య అనుమతుల ప్రక్రియ పూర్తయిన అనంతరం పాలసీ పరిధిలోకి వచ్చే అర్హమైన వైద్య ఖర్చులను నేరుగా బీమా సంస్థ భరించే అవకాశం ఉంటుందని వివరించారు. దీనివల్ల రోగులు చికిత్స సమయంలో నగదు సమకూర్చుకోవడానికి పడే ఇబ్బందులు తగ్గుతాయని తెలిపారు. అయితే ప్రతి పాలసీకి సంబంధించిన నిబంధనలు, బీమా పరిమితి, వెయిటింగ్ పీరియడ్, మినహాయింపులు, చికిత్సకు ముందస్తు అనుమతి వంటి అంశాల ఆధారంగా నగదు రహిత సదుపాయం వర్తిస్తుందని స్పష్టం చేశారు. హిందూపురం పట్టణంతో పాటు పరిసర గ్రామీణ ప్రాంతాల ప్రజలు వైద్య అవసరాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ఆరోగ్య బీమా ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించి తగిన బీమా పాలసీ కలిగి ఉండాలని సూచించారు. ముఖ్యంగా కుటుంబంలో ఒకరికి అనారోగ్య సమస్య ఎదురైనప్పుడు మొత్తం కుటుంబ ఆర్థిక పరిస్థితిపై భారం పడకుండా ఆరోగ్య బీమా రక్షణగా నిలుస్తుందని వివరించారు. జతిన్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో జనరల్ ఫిజీషియన్‌గా తాను వైద్య సేవలు అందిస్తున్నానని, రోగులకు నాణ్యమైన వైద్యం అందించడంతో పాటు వారికి అందుబాటులో ఉన్న బీమా సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా సహకరిస్తామని డాక్టర్ వెంకటరమణ నాయక్ తెలిపారు. క్యాష్‌లెస్ వైద్య సేవలకు సంబంధించి మరిన్ని వివరాలు, ఏయే పాలసీలకు ఏయే చికిత్సలు వర్తిస్తాయి, అవసరమైన పత్రాలు, అనుమతుల ప్రక్రియ తదితర వివరాల కోసం ఆస్పత్రిని నేరుగా సంప్రదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ప్రజోపయోగ పనులతో మన్ననలు.

మున్సిపల్ కమిషనర్ కు ఘన సన్మానం.

హిందూపురం: నవంబర్ 13 సీమ వార్త. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం వల్ల ఏ శాఖ కు చెందిన అధికారులైన ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని అదనపు జిల్లా జడ్జి వి. వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. స్థానిక న్యాయస్థాన సముదాయానికి నూతనంగా రహదారి ఏర్పాటు చేయడంలో చొరవ చూపిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ను శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎడిజేతో పాటు సీనియర్ సివిల్ జడ్జి హేమలత, జూనియర్ సివిల్ జడ్జిలు నిఖిల్ రెడ్డి, లలితా లక్ష్మీ హారిక కోట ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆదనపు జిల్లా జడ్జి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గుంతల మయమైన న్యాయస్థాన రహదారి ఏర్పాటుకు కమిషనర్ మల్లికార్జున ఎంతో చొరవ చూపారని ప్రశంసించారు. అదే విధంగా పట్టణంలో చెత్తాచెదారం తొలగింపుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున మాట్లాడుతూ, న్యాయస్థానాలకు న్యాయమూర్తులు, న్యాయవాదులతో పాటు వివిధ కార్యాలయాలకు ప్రజలు, కక్షిదారులు రాకపోకలు సాగిస్తుంటారని, దీంతో ఆ రహదారి ఏర్పాటుకు కృషి చేసినట్లు తెలిపారు. ఈ రహదారి ఏర్పాటు వల్ల తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. న్యాయశాఖ అంటే



తనకు ఎంతో గౌరవం అని, రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలో చెత్తాచెదారాన్ని తొలగించేందుకు ప్రత్యేకంగా ఈ ఆటోలను ఏర్పాటు చేసినట్లు కమీషనర్ తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ మాట్లాడుతూ, గుంతల మయమైన రహదారి ఏర్పాటుకు అడిగిన వెంటనే సహకరించి ఒక సిమెంట్ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ కమిషనర్ చొరవ తీసుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ గోపాలకృష్ణ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, స్టాండింగ్ కౌన్సిల్ నాగేంద్ర, న్యాయవాదులు రాజశేఖర్, నాగరాజు రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సిద్దు, గూండాచారి, వన్నేరువప్ప, గోపాల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రైతు బజార్‌లో ప్రత్యేక ధరణి బియ్యం కౌంటర్ ప్రారంభం

సన్న బియ్యం ను తక్కువ ధరలో విక్రయించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు



ధర్మవరం రూరల్ నవంబర్ 13 సీమ వార్త : ఎల్నీనో ప్రభావంతో నిత్యవసర సరుకులు ఆకాశాన్ని అంటుతున్న వేళ అందులో భాగమైన సన్నబియ్యంను తక్కువ దొరికే విక్రయించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని పేద,మధ్యతరగతి కుటుంబాల వారికి ఊరటనిస్తోంది.ధర్మవరం మండలంలోని రైతు బజార్‌లో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం కౌంటర్ ద్వారా ధరణి కె.ఎన్.ఎం రకం బియ్యాన్ని ప్రజలకు ప్రజలకు తక్కువ దొరికే విక్రయించే విధంగా అందుబాటులో ఉంచడం జరిగింది.ఈ ప్రత్యేక బియ్యం కౌంటర్‌లో మొత్తం 448 బస్తాల బియ్యం, ఒక్కో బస్తాలో 26 కిలోల చొప్పున మొత్తం 11,648 కిలోల బియ్యం విక్రయానికి అందుబాటులో ఉంచడం జరిగింది. ఒక్కో 26 కిలోల బస్తా ధర రూ.1,300గా నిర్ణయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో వంశీకృష్ణారెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి, ఎస్. దేవరాజు తహసీల్దార్, పి. రమణబాబు, సీడీఎస్‌టీ ఇన్‌చార్జ్, ధర్మవరం మండలం మరియు ప్రత్యేక బియ్యం కౌంటర్ నిర్వాహకులు శ్రీ ఎం. ధర్మతేజ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ధర్మవరం తాసిల్దార్ దేవరాజు మాట్లాడుతూ బియ్యం విక్రయాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సజావుగా నిర్వహించాలని, విక్రయించే ప్రతి బస్తాకు సంబంధించి కొనుగోలుదారుల నుంచి సరైన రసీదు మరియు అంగీకార పత్రం తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని నిర్ణీత ధరకు అందించడంతో పాటు, పారదర్శకంగా మరియు సక్రమంగా విక్రయాలు జరిగేలా అధికారులు తగిన చర్యలు చేపట్టారు.

బాలల సంరక్షణకు ప్రత్యేక చట్టాలు.

-బాల్య వివాహాలతో అనర్థాలు ..

- అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి హారిక కోట.



హిందూపురం: నవంబర్ 13 సీమ వార్త. బాలల సంరక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయని స్థానిక అదనపు జూనియర్ సివిల్ జడ్జి లలితా లక్ష్మి హారిక కోట పేర్కొన్నారు. విద్యార్థి దశ నుండే చట్టాలపై అవగాహన పెంచుకొని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బాలల దినోత్సవం పురస్కరించుకొని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శుక్రవారం అంబేద్కర్ గురుకుల బాలికల పాఠశాలలో సురక్షిత్ బచపన్ అభియాన్ లో భాగంగా న్యాయవిజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ, బాలల సంరక్షణ కోసం అనేక ప్రత్యేక చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. ముఖ్యంగా పోక్సో చట్టం ద్వారా లైంగిక వేధింపులకు గురి చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రధానంగా సమాజంలో ఓ ప్రధాన రుగ్మతగా ఉంటున్న బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలకు ఎక్కడైనా వివాహాలు నిర్వహిస్తుంటే వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. బాల్యవివాహాల వల్ల అనేక అనర్థాలు చోటు చేసుకుంటాయని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం 14 ఏళ్ల లోపు బాలబాలికలందరికి నిర్బంధ ఉచిత విద్యను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. దీనికి తోడు 14 ఏళ్ల లోపు పిల్లలను ఎట్టి పరిస్థితులలోనూ పనుల్లోకి పెట్టుకోరాదన్నారు. సంబంధిత బాలలతో పనులు చేయిస్తే చట్టరీత్యా శిక్షలు తప్పవని హెచ్చరించారు. విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతి లేకుండా అమ్మాయిలను ఎవరూ తాకరాదన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలకు సైతం ఆయా చట్టాలపై వివరించి చైతన్యం తీసుకురావాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులు అన్న నానుడికి అనుగుణంగా విద్యార్థి దశలో విద్యాభ్యాసం సాగించి తల్లిదండ్రులు గర్వపడేలా ఉన్నత స్థాయికి చేరుకోవాలని న్యాయమూర్తి సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో న్యాయమూర్తి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ నాగమణి, ఉప ప్రిన్సిపాల్ ఇందిరా, లోక్ అదాలత్ సిబ్బంది రాజా, పారా లీగల్ వాలంటీర్లు సురేష్, మాళప్ప తదితరులు పాల్గొన్నారు.

24 తేదీన హిందూపురంలో ఆనందమార్గ ఆధ్యాత్మిక శిబిరం.



హిందూపురం: నవంబర్ 13 సీమ వార్త. ఆనంద మార్గ ప్రచారక సంఘం ఆధ్వర్యంలో ఆనంద సుపర్ రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, శ్రీ అక్షయ కల్పవృక్షం సేవాసమితి సంయుక్త సహకారంతో ఈనెల 24వ తేదీన హిందూపురంలో ఆనందమార్గ ఆధ్యాత్మిక శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు శుక్రవారం విలేకర్ల సమావేశంలో శ్రీ ఆచార్య ప్రబోధ ఆత్మబోదనాద్ అవధూత, శ్రీ ఆచార్య సదాశివానాద్ అవధూత, చారుకీర్తి లు మాట్లాడుతూ పెనుకొండ రోడ్డులోని శ్రీ సరస్వతి విద్యా మందిరం వద్ద ఈ శిబిరం నిర్వహించనున్నట్లు శిబిరం నిర్వాహకులు తెలిపారు. ఆనందమార్గ ఆధ్యాత్మిక కార్యక్రమాలపై అవగాహన కల్పించడంతో పాటు, ధ్యానం, యోగా, సాధన వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి వరకు వివిధ కార్యక్రమాలను నిర్వహించడంతోపాటు ఉదయం రాగ సాధన, ప్రభాత సంగీతం, ఉపన్యాసం మధ్యాహ్నం భోజన విరామం, సాయంత్రం కీర్తన, త్రిపురార్చన తదితర కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ శిబిరంలో పాల్గొనదలచిన వారు నిర్వాహకులను సంప్రదించాలన్నారు. ఆధ్యాత్మిక సాధనపై ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిజెపి సురువు రామాంజనేయులు, ప్రకాష్, మాశ్రిమలై తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ చెల్లింపుల్లో రివర్స్ ఛార్జ్ విధానంపై అవగాహన అవసరం



కడప, డిసెంబర్ 12, (సీమ వార్త) : అద్దె లావాదేవీల్లో జీఎస్టీ నిబంధనల అమలు, రివర్స్ ఛార్జ్ విధానంపై పన్ను నిపుణులు అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర పన్నుల శాఖ కడప డివిజన్ జాయింట్ కమిషనర్ జి. సుమతి సూచించారు. పన్ను చెల్లింపుల్లో నిబంధనలు ఉల్లంఘించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. నగరం లోని మానస ఇన్ హోటల్‌లో రాష్ట్ర పన్నుల శాఖ ఆధ్వర్యంలో అద్దెలపై జీఎస్టీ, రివర్స్ ఛార్జ్ విధానంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అద్దె చెల్లించేవారు, అద్దె పొందేవారికి జీఎస్టీ చట్టం ప్రకారం ఉండే బాధ్యతలు, పన్ను వర్తించే సందర్భాలు, రిటర్నుల దాఖలు, పన్ను చెల్లింపులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పన్ను నిబంధనలపై స్పష్టమైన అవగాహనతో వ్యవహరించి నిర్దిష్ట గడువులోగా పన్నులు చెల్లించాలని సూచించారు. ఈ సందర్భంగా పన్ను నిపుణులు అడిగిన సందేహాలకు సమాధానాలు ఇచ్చారు. ఆడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. షరీఫ్ ఖాన్ మాట్లాడుతూ పన్ను నిబంధనలపై ఇటువంటి అవగాహన సదస్సులు నిర్వహించడం ద్వారా నిపుణులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె. కేదారేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్లు పి. పద్మావతి, డి. రవికుమార్ రెడ్డి, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ డి. శ్రీనివాసులు రెడ్డి, ఆడిటర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, పన్ను ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలతో సందడిగా బాలల దినోత్సవ వేడుకలు



మైదుకూరు, నవంబర్ 13, (సీమ వార్త) : లెక్కలవారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. నరసింహులు ఆదేశాల మేరకు ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు పి. రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్వాతంత్ర్య భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తన తల్లిదండ్రులు రామసుబ్బారెడ్డి, వీరమ్మ జ్ఞాపకార్థం శ్రీ వీరరామ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థులకు రూ.15 వేల విలువైన క్రీడా దుస్తులను అందజేయడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, సహకార భావం, సాటి మనుషులకు సహాయం చేయాలనే సేవాగుణంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, కృషి, పట్టుదల, పోటీతత్వాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఇందుకు అవకాశం కల్పించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు, విద్యార్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు. బాలల దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు. ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలు లక్ష్మీదేవి సహకారంతో మిఠాయిలు పంపిణీ చేయగా, సైన్స్ ఉపాధ్యాయురాలు అరుణ సహకారంతో రూ.5 వేలకుపైగా విలువైన బహుమతులను అందజేశారు. విద్యార్థులు ఆనందోత్సాహాలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు చింతకాయల మహమ్మద్ సాదిక్, ఒంటేరు రమాదేవి, చంద్రకళ, అరుణ, లక్ష్మీదేవి, శ్రీనివాసులు, మనోహర్ రెడ్డి, గజ్జల వెంకటేశ్వర రెడ్డి, ఓబులేసు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయవ్యవస్థతో సమన్వయానికి కలెక్టర్, ఎస్పీ మర్యాదపూర్వక భేటీ

కడప, నవంబర్ 13, (సీమ వార్త) : జిల్లా న్యాయవ్యవస్థకు, పరిపాలనా యంత్రాంగానికి మధ్య పరస్పర సమన్వయం, సత్సంబంధాల ప్రాధాన్యతను చాటుతూ అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, జిల్లా ఎస్పీ ధీరజ్ కునుగులి కడప జిల్లా ప్రధాన, సెషన్స్ న్యాయమూర్తి జి. రామగోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి వారు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ భేటీలో భాగంగా కలెక్టర్, ఎస్పీ పుష్ప మొక్కను అందజేసి న్యాయమూర్తికి స్వాగతం పలికారు. అనంతరం న్యాయవ్యవస్థకు సంబంధించిన అంశాలతో పాటు జిల్లా పరిపాలన, పోలీసు శాఖల విధులు, పరస్పర సహకారం, సమన్వయంతో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కొద్దిసేపు చర్చించారు. ఈ సందర్భంగా నూతన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి తమ శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన పదవీకాలం సజావుగా సాగాలని ఆకాంక్షించారు.

రైతులంతా సహకార సంఘం ఎన్నికలకు సిద్ధం కావాలి



మైదుకూరు, నవంబర్ 13, (సీమ వార్త) : సహకార సంఘం ఎన్నికల్లో ప్రతి సభ్యుడూ తన ఓటు హక్కును వినియోగించుకునేలా తప్పనిసరిగా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మైదుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పాశం మారుతి సూచించారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో రైతులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ 2013 నుంచి సంఘంలో ఎన్నికలు జరగలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈకేవైసీ పూర్తి చేయని సభ్యులు ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కొత్తగా సభ్యత్వం పొందాలనుకునే 18 ఏళ్లు నిండిన వారు ఆధార్, ఫొటోలు, భూమి లేదా కౌలు సాగుకు సంబంధించిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంఘం సభ్యులైన రైతులంతా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు బయన బోయిన నరసింహులు, పోలు చిన్న కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె ఎన్నికల్లో ఓటరుకు స్వేచ్ఛ కల్పించాలి

అధికార యంత్రాంగం ఒత్తిళ్లకు తలొగ్గకుండా విధులు నిర్వర్తించాలి..

అన్ని పంచాయతీల్లో అభ్యర్థులను నిలబెడతాం: మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి



ప్రొద్దుటూరు, నవంబర్ 13, (సీమ వార్త) : రానున్న పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి కోరారు. గత స్థానిక సంస్థలు, ఎంపీటీసీ ఎన్నికల సందర్భంగా ఎదురైన ఇబ్బందులు, దాడులు మళ్లీ పునరావృతం కాకుండా ఎన్నికల ప్రక్రియను నిష్పక్షపాతంగా నిర్వహించాలని కలెక్టర్, ఎస్పీలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం దొరసానిపల్లెలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసే సమయంలోనూ ఇబ్బందులు ఎదురయ్యాయని, లాఠీచార్జీలు, రాళ్ల దాడులు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన అధికార యంత్రాంగం, కూటమి నాయకుల దాడులకు పరోక్షంగా సహకరించిందని విమర్శించారు. ఈసారి అటువంటి పరిస్థితులకు అవకాశం లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల సమయంలో రాజకీయ విభేదాలు, వ్యక్తిగత పట్టుదలలు ఘర్షణలకు దారితీయకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. ఓటును డబ్బులకు అమ్ముకునే ప్రజల్లో మార్పు రావాలా, ఓట్లను కొనుగోలు చేసే నాయకులు మారాలా, లేక ఓటు హక్కు వినియోగానికి అడ్డంకులు సృష్టించే అధికార యంత్రాంగంలో మార్పు రావాలా అని మేధావులను ప్రశ్నించారు. గత ఎంపీటీసీ ఎన్నికల్లో జరిగినట్లు నామినేషన్ పత్రాలను ధ్వంసం చేయడం, నామినేషన్లు వేసేందుకు వెళ్లే అభ్యర్థులపై లాఠీచార్జీలు చేయడం వంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు శాఖ ప్రత్యేక నిఘా ఉంచాలని కోరారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించడంలో ఎలాంటి రాజీ ఉండకూడదని పేర్కొన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గంలోని అన్ని పంచాయతీల్లో తమ పార్టీ అభ్యర్థులను పోటీకి నిలబెడతామని రాచమల్లు వెల్లడించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలువల అభివృద్ధితో పట్టణంలో డ్రైనేజీ కష్టాలకు చెక్



ప్రొద్దుటూరు, నవంబర్ 13, (సీమ వార్త) : పట్టణంలో డ్రైనేజీ సమస్యల నివారణకు మున్సిపల్ యంత్రాంగం చేపడుతున్న చర్యల్లో భాగంగా మడూరు కాలువలో జరుగుతున్న పూడికతీత పనులను మున్సిపల్ చైర్మన్ నంద్యాల రాఘవరెడ్డి పరిశీలించారు. కాలువలో పేరుకుపోయిన పూడికను తొలగించి మురుగునీరు సజావుగా ప్రవహించేలా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కాలువల నిర్వహణలో నిర్లక్ష్యం లేకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు డ్రైనేజీ సమస్యల నుంచి ఉపశమనం కలిగించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు, డీఈ రాజేష్, కౌన్సిలర్ వంగనూరు మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో 18 పవిత్ర మెట్లకు ఇత్తడి తాపడం..

రూ.10 లక్షలతో భక్తుల సేవా కార్యక్రమం



ప్రొద్దుటూరు, నవంబర్ 13, (సీమ వార్త) : పెన్నానది తీరంలోని ప్రొద్దుటూరు పట్టణ శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థానంలో భక్తుల సహకారంతో పదునెట్టాంబడి 18 పవిత్ర మెట్లకు ఇత్తడి తాపడం పనులు ప్రారంభించారు. అయ్యప్ప భక్తుల మిత్ర బృందం దాదాపు రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ కార్యక్రమానికి శ్రీ కొప్పూరు రమేష్ రెడ్డి అధ్యక్షత వహించి శ్రీకారం చుట్టారు. అయ్యప్ప స్వామి ఆలయంలో ఎంతో పవిత్రంగా భావించే 18 మెట్లకు ఇత్తడి తాపడం చేయించడం ద్వారా ఆలయ పవిత్రత, ఆధ్యాత్మిక శోభ మరింత పెంపొందుతాయని భక్తులు తెలిపారు. స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అమృతేశ్వర స్వామి, శ్రీ స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కొప్పూరు రమేష్ రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు నాగేంద్ర శర్మ, కోశాధికారి టంగుటూరు వినోద్ కుమార్, మాలేపాటి రవికుమార్, గురుస్వామి లక్ష్మిరెడ్డి, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలి



ప్రొద్దుటూరు, నవంబర్ 13, (సీమ వార్త) : రాష్ట్రంలోని న్యాయవాదుల భద్రతకు ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రొద్దుటూరు న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.ఎం. ప్రసాద్ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక కోర్టు ప్రాంగణం నుంచి ర్యాలీగా బయలుదేరి తమ డిమాండ్‌ను ప్రభుత్వానికి తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ విధి నిర్వహణలో న్యాయవాదులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దాడులు, బెదిరింపుల నుంచి వారికి తగిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. న్యాయవాదులు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ వృత్తిని కొనసాగించేందుకు ప్రత్యేక చట్టం అవసరమని పేర్కొన్నారు. న్యాయవాదులపై దాడులు జరిగినప్పుడు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా, వారి భద్రతకు చట్టపరమైన భరోసా కల్పించే విధంగా రక్షణ చట్టాన్ని రూపొందించాలని కోరారు. న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం గుర్తించి, వారి న్యాయమైన డిమాండ్‌ను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పలువురు న్యాయవాదులు పాల్గొని న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల మూడో విడత పోలింగ్ సిబ్బందికి శిక్షణ.

హిందూపురం: నవంబర్ 13 సీమ వార్త. గ్రామ పంచాయతీ ఎన్నికలు 2026 మూడో విడత పోలింగ్ నిర్వహణలో భాగంగా స్థానిక ఆర్ఎంఎస్ ఫంక్షన్ హాల్ లో శనివారం ఉదయం 10 గంటలకు నియమించబడిన పోలింగ్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో తెలిపారు పోలింగ్ విధులకు నియమించబడిన సిబ్బందితో పాటు స్టేజ్--1, స్టేజ్--2 అధికారులకు, ఇప్పటికే శిక్షణ పొందిన మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ ద్వారా ఎన్నికల విధివిధానాలు, పోలింగ్ నిర్వహణ, బ్యాలెట్ పేపర్ల వినియోగం, ఎన్నికల నియమ నిబంధనలు మరియు విధుల నిర్వహణపై సమగ్ర శిక్షణ అందించడం జరుగుతుందన్నారు ఎన్నికల విధులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా, ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు సిబ్బందికి అవసరమైన సూచనలు మరియు అవగాహన కల్పించడం జరుగుతుందని ఎంపీడీవో తెలియజేశారు.

చనిపోని వ్యక్తికి డెత్ సర్టిఫికెట్

నకిలీ పత్రాలతో రూ.22.50 లక్షల టోకరా

స్థలం కొని మోసపోయిన బాధితుడు



తాడిపత్రి, నవంబర్ 13 సీమవార్త: తాడిపత్రి మండలం గన్నేవారిపల్లి కాలనీకి చెందిన కత్రికల ఓబులేష్ (52) ఫిర్యాదు మేరకు నకిలీ పత్రాలతో స్థలం విక్రయించి రూ.22.50 లక్షలు మోసం చేసిన ఘటనలో తాడిపత్రి రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. 31.10.2025వ తేదీన గన్నేవారిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం.933-1లో ఉన్న ప్లాట్ నెం.34, విస్తీర్ణం 2½ సెంట్ల స్థలాన్ని తాడిపత్రికి చెందిన అంకిరెడ్డి నవ తేజేశ్వర్ రెడ్డి వద్ద కొనుగోలు చేశాడు.అయితే ఇటీవల సదరు స్థలానికి సంబంధించి పూర్వపు యజమాని బంధువులు తమకు ఆ స్థలం చెందినదని ఫిర్యాదుదారునికి తెలియజేశారు. దీంతో ఆయన విచారణ చేయగా పూర్వపు యజమాని మరణించినట్లు నకిలీ డెత్ సర్టిఫికెట్లు సృష్టించి, వాటి ఆధారంగా నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు తయారుచేసి స్థలాన్ని విక్రయించినట్లు తెలిసిందని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యవహారంలో వాస్తవాలను దాచిపెట్టి, తన వద్ద నుండి అగ్రిమెంట్ చేయించి మొత్తం రూ.22,50,000/- తీసుకొని మోసం చేసినట్లు అంకిరెడ్డి నవ తేజేశ్వర్ రెడ్డిపై ఫిర్యాదుదారుడు ఆరోపించారు. పలుమార్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరినా స్పందించలేదని తెలిపారు. ఈ కేసులో నకిలీ పత్రాలు ఎలా సృష్టించారు, ఇందులో ఇంకెవరైనా ఉన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.స్థలాలు కొనే ముందు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, అనుమానం ఉంటే పోలీసులను, రెవెన్యూ అధికారులను సంప్రదించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

ఎన్నికల సేవలకు నగదు ప్రోత్సాహకం.. సిబ్బందికి ఊరట!

హోదాలను బట్టి గౌరవ వేతనం ఖరారు.. రూ.6 వేల నుంచి రూ.20 వేల వరకు చెల్లింపు



ప్రొద్దుటూరు, నవంబర్ 13, (సీమ వార్త) : మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా విధులు నిర్వర్తించిన అధికారులు, ఉద్యోగులకు ప్రభుత్వం గౌరవ వేతనం ప్రకటించింది. 2026 రెండో సాధారణ మున్సిపల్ ఎన్నికల ఫేజ్-1లో ఎన్నికల బాధ్యతలు చేపట్టిన సిబ్బందికి వారి హోదా, విధుల ఆధారంగా పారితోషికం చెల్లించేందుకు మున్సిపల్ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయాన్ని ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ శుక్రవారం వెల్లడించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం రిటర్నింగ్ అధికారులకు రూ.20 వేలు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు రూ.16 వేలు, ఎన్నికల అధికారులకు రూ.15 వేలు, అదనపు, సహాయ ఎన్నికల అధికారులకు రూ.12 వేలు చొప్పున చెల్లించనున్నారు. గెజిటెడ్ అధికారులకు రూ.15 వేలు, సీనియర్ అసిస్టెంట్ స్థాయి వరకు ఉన్న నాన్ గెజిటెడ్ ఉద్యోగులకు రూ.12 వేలు, జూనియర్ అసిస్టెంట్లు, వార్డు సెక్రటరీలకు రూ.9 వేలు, ఇతర కేటగిరీల సిబ్బందికి రూ.6 వేలు గౌరవ వేతనంగా అందజేయనున్నారు. ఎన్నికల విధుల కోసం శిక్షణ ఇచ్చిన మాస్టర్ ట్రైనర్లకు వారు వాస్తవంగా హాజరైన రోజులను పరిగణనలోకి తీసుకుని రోజుకు రూ.800 చొప్పున చెల్లించనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది అందించిన సహకారం అభినందనీయమని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ గౌరవ వేతనం అందజేస్తామని ఆయన పేర్కొన్నారు.

రైతులంతా సహకార సంఘం ఎన్నికలకు సిద్ధం కావాలి



మైదుకూరు, నవంబర్ 13, (సీమ వార్త) : సహకార సంఘం ఎన్నికల్లో ప్రతి సభ్యుడూ తన ఓటు హక్కును వినియోగించుకునేలా తప్పనిసరిగా ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని మైదుకూరు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు పాశం మారుతి సూచించారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో ఆయన ఆధ్వర్యంలో రైతులకు ఎన్నికల నిర్వహణపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ 2013 నుంచి సంఘంలో ఎన్నికలు జరగలేదని, ప్రస్తుత ప్రభుత్వం ఈ ఏడాది ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఈకేవైసీ పూర్తి చేయని సభ్యులు ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని స్పష్టం చేశారు. కొత్తగా సభ్యత్వం పొందాలనుకునే 18 ఏళ్లు నిండిన వారు ఆధార్, ఫొటోలు, భూమి లేదా కౌలు సాగుకు సంబంధించిన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంఘం సభ్యులైన రైతులంతా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు బయన బోయిన నరసింహులు, పోలు చిన్న కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

చందన గ్రామంలో పోలీసుల పర్యటన

యాడికి సిఐ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు శాంతి భద్రతల అవగాహన



యాడికి నవంబర్ 13 (సీమ వార్త)యాడికి మండలంలోని చందన గ్రామ పంచాయతీలో సీఐ ఆర్. శ్రీనివాసులు పర్యటించారు. గ్రామంలో పర్యటిస్తూ స్థానిక పరిస్థితులను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. రాబోయే పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని తెలిపారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో పోలీస్ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

ఇంటింటికీ తిరిగి దోమల స్థావరాలు ధ్వంసం!

డ్రై డే లో పాల్గొన్న మంగపట్నం లక్ష్మీదేవి, రత్నాకరం ప్రణీత



తాడిపత్రి, నవంబర్ 13 సీమవార్త: తాడిపత్రి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డ్, 11వ వార్డ్ లలో శుక్రవారం నిర్వహించిన డ్రైడే డ్రై డే కార్యక్రమంలో కౌన్సిలర్లు మంగపట్నం లక్ష్మీదేవి, రత్నాకరం ప్రణీత గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది, ఆశా వర్కర్లు, వాలంటీర్లతో కలిసి వార్డుల్లో ఇంటింటికీ తిరిగారు. ఇళ్లలో నిల్వ ఉన్న నీటిని పరిశీలించి, కూలర్లు, పూల కుండీలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, నీటి తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి దోమల స్థావరాలను ధ్వంసం చేశారు. దోమల వల్ల వచ్చే డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా వంటి వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి, ఇంటి పరిసరాలను పొడిగా ఉంచుకోవాలని కోరారు. వారానికి ఒకసారి నీటి నిల్వ పాత్రలను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, వాలంటీర్లు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

జిల్లాలో....టన్ను ఇసుక ధర రూ.158/- గా ఖరారు..!!

-మొదటిపేజీ తరువాయి

సరఫరా చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం జిల్లాలో ఉన్న డిసైలటేషన్ పాయింట్ ల లో ఇసుక నిల్వ అందుబాటులో ఉంది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ఫోర్‌షోర్ ఏరియా లో నూతనంగా డీ-సిల్టేషన్ చేపట్టేందుకు ఆహ్వానించిన టెండర్లను కమిటీ ఆమోదించింది.బ్లాక్ నం. 25 ఉ 26 (15,050 మెట్రిక్ టన్నులు) తక్కువ ధరకు కోట్ చేసిన యాదవ చంద్రశేఖర్ (హిందూపురం) ూ1 బిడ్డర్‌గా ఎంపికయ్యారు బ్లాక్ నం. 29 ఉ 30 (15,300 మెట్రిక్ టన్నులు) తక్కువ ధరకు కోట్ చేసిన తల్లూరి శ్రీధర్ (అనంతపురం) ఎల్ 1 బిడ్డర్‌గా ఎంపికయ్యారు రెండు బ్లాకులు పక్కపక్కనే ఉన్నందున స్టాక్ పాయింట్ వద్ద ఇసుక విక్రయ ధరను టన్నుకు రూ. 112/- గా, మరియు అడ్మినిస్ట్రేటివ్ చార్జీలు (రూ. 36), సిఐటిఈ / సి టి ఓ ఫీజు (రూ. 2.50), 5% జీఎస్టీ (రూ. 7.50) కలుపుకొని వినియోగదారులకు అందజేసే తుది ధరను టన్నుకు రూ. 158/- గా కమిటీ ఖరారు చేసింది. ఎంపికైన ఏజెన్సీలకు తక్షణమే వర్క్ ఆర్డర్లు జారీ చేయాలని ఆదేశించారు.

ముదిగుబ్బ మండలం కొడవండ్లపల్లి గ్రామంలోని పట్టా భూమిలో (సర్వే నం. 129-2, 130 ఉ 131) డీ-కాస్టింగ్ అనుమతి పొందిన ప్రక్రియలో ఇంకా 18,230 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ అందుబాటులో ఉన్నట్లు సమీక్షించారు.ఎన్ హెచ్ 44 (హైదరాబాద్- బెంగళూరు సెక్షన్) లో వియూపీలు మరియు సర్వీస్ రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్న లెకన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ . సంస్థకు 29,796 క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం దృష్ట్యా, బత్తలపల్లి మండలం నల్లబోయనపల్లి (ణ. చెర్లోపల్లి) పాత స్టాక్ పాయింట్ వద్ద నిల్వ ఉన్న 8,742 మెట్రిక్ టన్నుల (5,828) ఇసుకను కేటాయించేందుకు కమిటీ అంగీకరించింది. ప్రతి టన్నుకు అడ్మిన్ చార్జీలు వసూలు చేయడంతో పాటు, సంబంధిత పట్టాదారుకు బకాయి ఉన్న భూమి అద్దె చెల్లింపు బాధ్యతను సదరు కాంట్రాక్టర్‌కు అప్పగించాలని నిర్ణయించారు.ఏపీ మైనర్ మినరల్ పాలసీ 2025 ప్రకారం అక్రమ మైనింగ్, నిల్వ మరియు బ్లాక్ మార్కెటింగ్‌కు పాల్పడే వారి వాహనాలను సీజ్ చేసి భారీ జరిమానాలు విధించాలని అధికారులను ఆదేశించారు. (మొదటిసారి పట్టుబడితే ట్రాక్టర్‌కు రూ. 10,000/-, 10 టైర్ల లారీకి రూ. 25,000/-, 10 టైర్లకు పైబడిన లారీ/మెషినరీకి రూ. 50,000/-రెండవసారి పట్టుబడితే రూ. 1,00,000/- వరకు జరిమానా విధించబడుతుంది). 2025-26 ఆర్థిక సంవత్సరంలో 173 కేసులు నమోదు చేసి రూ. 20,92,800/-, మరియు 2026-27 (30-10-2026 వరకు) లో 114 కేసులు నమోదు చేసి రూ. 20,15,050/- జరిమానా వసూలు చేసినట్లు అధికారులు వివరించారు.

ఈ సమావేశంలో మైన్స్ ఉ జియాలజీ ఎడి అమీర్ బాషా,రాజశేఖర్ రెడ్డి గ్రౌండ్ వాటర్),ూ. ఉమామహేశ్వర రావు, మైనర్ ఇరిగేషన్), రామభూపాల్ రెడ్డి ధర్మవరం), వెంకటేశ్వర రావు పులివెందుల), గంగాధర్ , మరియు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజకీయ వారసత్వానికి చరమగీతం పాడాలి..!!

-మొదటిపేజీ తరువాయి

అవకాశాలు ఉండకూడదా? అనే ప్రశ్నలను ప్రతి ఓటరు తనకు తాను వేసుకోవాల్సిన అవసరం ఆసన్నమైందని కావున చెన్నేకొత్తపల్లి మండల ప్రజలారా.మీ ఓటు అమ్మకానికి కాదు. మీ ఆత్మగౌరవానికి ప్రతీకలాంటిదని, రాజకీయ వారసత్వాలకు చరమగీతం పాడడం ఎంతైనా అవసరమని ప్రజాసేవ ముసుగులో స్వార్థ ప్రయోజనాలు నెరవేర్చుకునే నాయకులను తిరస్కరించాలని నిజాయితీగా పనిచేసే సామాన్య ప్రజలకు నాయకత్వ అవకాశం కల్పించాలని అధికారం కొందరి కుటుంబాల సొంతం కాదు.. ప్రజలందరి ప్రజాస్వామ్య హక్కు, సామాన్యులకు రాజ్యాధికారం దక్కినప్పుడే రాజ్యాంగ లక్ష్యాలకు నిజమైన సార్థకత చేకూరుతుందని సమాజ శ్రేయస్సును కోరేవారు, ప్రజా స్వామ్య పరిరక్షకులు, మేధావులు, సామాజిక సంస్కరణ కర్తలు, విద్యావంతులు కోరుకుంటున్నారు.

3.71 లక్షల మంది ఓటర్లతో తొలి విడత పంచాయతీ సమరం

కడప, నవంబర్ 13, (సీమ వార్త) : వైఎస్సార్ కడప జిల్లాలో తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ శ్రీధర్ చెరుకూరి తెలిపారు. 13 మండలాల పరిధిలోని 176 గ్రామ పంచాయతీల్లో సర్పంచి, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించేందుకు యంత్రాంగం సిద్ధమవుతోందని వెల్లడించారు. తొలి విడత ఎన్నికల్లో 3,71,999 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఇందుకోసం 1,788 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అట్లూరు, బి.కోడూరు, బద్వేలు, గోపవరం, కలసపాడు, పోరుమామిళ్ల, శ్రీ అవధూత కాశీనాయన, సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట, సుండుపల్లి, వీరబల్లి మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయని వివరించారు. ఆయా మండలాల్లో 176 సర్పంచి, 1,768 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. నవంబర్ 15 నుంచి 17వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 18న పరిశీలన చేపట్టనున్నారు. తిరస్కరణకు గురైన నామినేషన్లపై 19వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అప్పీలు చేసుకోవచ్చు. 20న అప్పీళ్ల పరిష్కారం, 21వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అనంతరం తుది అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. నవంబర్ 26న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించి, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడించనున్నారు. అదే రోజు ఉప సర్పంచి ఎన్నిక కూడా నిర్వహిస్తారు. అవసరమైతే 27వ తేదీన తిరిగి పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన 1,788 బ్యాలెట్ పెట్టెల్లో ఇప్పటికే 605 అందుబాటులో ఉన్నాయని, మిగిలిన వాటిని సమకూర్చుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల సామగ్రి పంపిణీ, స్వీకరణ, భద్రత కోసం జిల్లావ్యాప్తంగా 39 చొప్పున పంపిణీ, స్వీకరణ కేంద్రాలతో పాటు భద్రపరిచే గదులను గుర్తించినట్లు వివరించారు. మొత్తం 6,136 పోలింగ్ కేంద్రాలకు 6,136 మంది ప్రిసైడింగ్ అధికారులు, 8,566 మంది ఇతర పోలింగ్ అధికారులు కలిపి 14,702 మంది సిబ్బంది అవసరమని గుర్తించినట్లు తెలిపారు. వీరికి ఎన్నికల విధులపై శిక్షణ ఇచ్చేందుకు జిల్లాలోని 39 మండలాల్లో ప్రత్యేక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల పర్యవేక్షణ కోసం 129 జోన్లకు 138 మంది జోనల్ అధికారులు, 256 రూట్లకు 272 మంది రూట్ అధికారులు, 185 క్లస్టర్లను గుర్తించి అవసరమైన అధికారులను నియమించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో 2,480 సాధారణ, 1,911 సున్నితమైన, 1,745 అత్యంత సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల నియమావళి అమలును పర్యవేక్షించేందుకు 39 ఫ్లయింగ్ నిఘా బృందాలు, 39 సిట్టింగ్ నిఘా బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. సేవా ఓటర్లు, నిర్బంధంలో ఉన్న ఓటర్లు, ఓటరు గుర్తింపు చీటీల పంపిణీకి ప్రత్యేక



చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి మండల కేంద్రంలో సౌకర్య కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఎన్నికల సంఘం నిబంధనలను అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని, న్యాయస్థానాల ఉత్తర్వులు అమల్లో ఉన్న గ్రామ పంచాయతీలు, పదవులకు సంబంధించి ఎన్నికల నోటీసులు జారీ చేయరాదని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియను సమన్వయంతో నిర్వహించి ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రశాంతంగా, పారదర్శకంగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

భారత్ సమ్మిట్ చుట్టూ రాజకీయాలు


హైదరాబాద్ : తెలంగాణ రాజధాని హైదరాబాద్ వేదికగా జరగుతున్న ప్రతిష్టాత్మక అంతర్జాతీయ భారత్ సమ్మిట్ చుట్టూ ఇప్పుడు జాతీయ స్థాయిలో రాజకీయ చర్చ ప్రారంభమైంది. ఒకవైపు రాష్ట్రానికి అంతర్జాతీయ పారిశ్రామిక ప్రగతిని, సాంకేతిక పెట్టుబడులను తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వ యంత్రాంగం కార్యక్రమ ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. అయితే, ఈ వేదికపై సీనియర్ కాంగ్రెస్ నేతలు చేసిన సంచలన వ్యాఖ్యలు, ఏఐసీసీ అగ్రనేతల భాగస్వామ్యం చూస్తుంటే.. ఇది కేవలం పారిశ్రామిక సదస్సా లేక కాంగ్రెస్ పార్టీ సిద్ధాంత ప్రచార వేదికనా అనే ప్రశ్నలు దౌత్య, రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.వివాదానికి ప్రధాన బీజం ఏఐసీసీ వేదికగా సీనియర్ నేత, మాజీ విదేశాంగ మంత్రి సల్మాన్ ఖుర్షిద్ చేసిన తాజా వ్యాఖ్యలే కారణం. స్విట్జర్లాండ్‌లోని దావోస్ సదస్సు తరహాలో హైదరాబాద్‌ను ఒక శాశ్వత అంతర్జాతీయ మేధో కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెబుతూనే.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ విదేశాంగ ధోరణులను ఆయన పరోక్షంగా ప్రశ్నించారు. నెహ్రూ అలీన విధానం, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీలు రూపకల్పన చేసిన రాజనీతి సిద్ధాంతాలతో పాటు భవిష్యత్ ప్రపంచానికి రాహుల్ గాంధీ అందించే నూతన అంతర్జాతీయ దృక్పథాన్ని ప్రపంచ ప్రతినిధుల ముందుంచే వేదికగా దీనిని నిర్వహిస్తున్నామని ప్రకటించడం ద్వారా ఈ సదస్సు చుట్టూ రాజకీయ సమీకరణాలు వేడెక్కాయి.లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్వయంగా విచ్చేస్తుండటంతో పాటు శామ్ పిట్రోడా, శశి థరూర్, గుర్దీప్ సప్పల్ వంటి కాంగ్రెస్ రంగాధిపతులు ఈ కార్యక్రమ రూపకల్పనలో ప్రధాన భూమిక పోషించడం విశేషం. ప్రపంచవ్యాప్తంగా 70కి పైగా దేశాల నుంచి విచ్చేస్తున్న దాదాపు 1,000 మంది ప్రతినిధులతో భౌగోళిక రాజకీయాలు, ప్రగతిశీల భావజాలం, ప్రజాస్వామ్య సూత్రాలపై చర్చలు జరపనున్నట్లు ప్రకటించారు. ఒక ప్రభుత్వ అధికారిక యంత్రాంగం, నిధులతో నడిచే సదస్సులో పార్టీ సిద్ధాంతాలకు, భావి రాజకీయ వ్యూహాలకు ప్రాధాన్యత ఇవ్వడం ఎంతవరకు సమంజసమనే డిబేట్



ప్రారంభమైంది.ఈ పరిణామాలపై విపక్ష బీజేపీ అత్యంత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతోంది. తెలంగాణ ప్రజల పన్నుల సొమ్మును, ప్రభుత్వ యంత్రాంగాన్ని రాహుల్ గాంధీ అంతర్జాతీయ ఇమేజ్ బిల్డింగ్ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఎన్డీయే నేతలు ఆరోపిస్తున్నారు. నిజమైన పెట్టుబడుల సదస్సు అయితే ప్రపంచ పారిశ్రామిక దిగ్గజాలు, పరిశ్రమల ఒప్పందాలు కేంద్రంగా చర్చలు జరగాలని, అలాకాకుండా నెహ్రూ విదేశాంగ విధానం గురించి ప్రభుత్వ ఖర్చుతో సమావేశాలు పెట్టడమేంటని విపక్షాలు నిలదీస్తున్నాయి. రాష్ట్ర నిరుద్యోగులు, రైతుల ప్రయోజనాలను పక్కనబెట్టి పార్టీ ప్రచారానికి వేదికగా మార్చడాన్ని తాము అంగీకరించబోమని హెచ్చరిస్తున్నాయి. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విమర్శలను ఏమాత్రం ఒప్పుకోవడం లేదు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ వివాదంపై స్పందిస్తూ.. రాబోయే డిసెంబర్‌లో జరగబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు ఈ భారత్ సమ్మిట్ ఒక బలమైన వైజ్ఞానిక, విజ్ఞాన భూమికగా ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. కేవలం ఫ్యాక్టరీలు, పారిశ్రామిక నిధులే కాకుండా ప్రపంచ స్థాయి విధాన నిర్ణేతలు, సాంకేతిక నిపుణులు హైదరాబాద్ వేదికగా ఆలోచనలు పంచుకోవడం వల్ల తెలంగాణ బ్రాండ్ ఇమేజ్ ప్రపంచపటంలో మరింత పెరుగుతుందని, దీనిని రాజకీయ కోణంలో చూడకూడదని ప్రభుత్వం వాదిస్తోంది. ఈ పరిణామాన్ని పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌తో పోల్చి చూస్తే ఆసక్తికరమైన తేడాలు కనిపిస్తాయి. విశాఖపట్నంలో నవంబర్ 12-13 తేదీల్లో జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు సంపూర్ణంగా పారిశ్రామిక రంగాలు, ఒప్పందాల చుట్టూనే సాగుతుండగా.. హైదరాబాద్‌లో జరుగుతున్న భారత్ సమ్మిట్ మాత్రం ఆర్థిక అంశాలతో పాటు రాజకీయ, సామాజిక-రాజనీతి చర్చలకు వేదికగా మారుతోంది. అంతర్జాతీయ వేదికలపై నూతన ఆలోచనలు, పాలసీలపై చర్చలు జరగడం ఏ నగరానికైనా మైలేజ్ ఇచ్చే అంశమే. అయితే, పారిశ్రామిక ప్రగతి, ఉద్యోగ కల్పన అనే ప్రాథమిక లక్ష్యాలు నెరవేరినప్పుడే ప్రభుత్వ నిధులతో నిర్వహించే ఇటువంటి గ్లోబల్ సదస్సులకు నిజమైన సార్థకత చేకూరుతుందని అంటున్నారు.

ఉత్తర తెలంగాణలో పట్టు సాధించేది ఎలా

కరీంనగర్ : తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని ఆధిపత్యం చలాయించిన బీఆర్ఎస్, వరుస ఎన్నికల పరాజయాల తర్వాత డీలా పడింది. ఇప్పుడు తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ముఖ్యంగా పార్టీకి కంచుకోటలుగా ఉన్న ఉత్తర తెలంగాణ జిల్లాలపై బీఆర్ఎస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి సారించింది. 2004 నుంచి పార్టీకి బలమైన పునాదిగా ఉన్న ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో కోల్పోయిన పట్టును తిరిగి సాధించడం ఇప్పుడు బీఆర్ఎస్ ముందున్న అతిపెద్ద సవాలు.పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ఈ పునరుజ్జీవ కార్యక్రమాలకు నాయకత్వం వహిస్తున్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఎదురైన చేదు అనుభవాలను సమీక్షించుకున్న తర్వాత, క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను తిరిగి ఉత్తేజపరిచేందుకు ఒక నెల రోజుల పాటు వరుస బహిరంగ సభలు, సమావేశాలకు ప్రణాళిక రూపొందించారు. గోదావరిఖనిలో జరిగిన సింగరేణి కార్మిక గర్జనతో మొదలైన ఈ రాజకీయ యాత్ర, ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల్లోని రైతు సదస్సుల మీదుగా సాగుతూ, నవంబర్ 29న కరీంనగర్‌లో నిర్వహించనున్న 'దీక్షా దివస్' వేదుకలతో పతాక స్థాయికి చేరనుంది. కార్మికులు, రైతులు, తెలంగాణ ఉద్యమ సెంటి మెంట్ అనే మూడు ప్రధాన అంశాలను ఎంచుకోవడం ద్వారా, తమ సంప్రదాయ ఓటు బ్యాంకును తిరిగి ఆకట్టుకో వాలని బీఆర్ఎస్ భావిస్తోంది.అయితే.. ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్‌కు పరిస్థితులు అంత సులభంగా లేవు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ స్థానాలను బీజేపీ కైవసం చేసుకోవడం గులాబీ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ. కేవలం ఎన్నికల ప్రచారాలకే పరిమితం కాకుండా, బీజేపీ తన సంస్థాగత బలాన్ని కూడా ఈ ప్రాంతంలో గణనీయంగా పెంచుకుంది. ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల్లో బీసీ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ కేంద్ర సహాయ మంత్రిగా ఉండటం వంటి అంశాలు బీజేపీకి క్షేత్రస్థాయిలో బలాన్ని చేకూర్చాయి.మరోవైపు, అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా బీఆర్ఎస్ గట్టి పోటీని ఎదుర్కొంటోంది. గతంలో తమ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేయడం ద్వారానే ఓట్లు రాబట్టవచ్చన్న



వ్యూహం ఇప్పుడు ఫలించడం లేదు. సింగరేణి ప్రాంతంలో 18,000 మంది వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించామని, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు సాగునీరు అందించామని బీఆర్ఎస్ నేతలు పదేపదే ప్రస్తావిస్తున్నప్పటికీ, అవి ఎన్నికల్లో ఓట్లుగా మారలేదన్నది స్పష్టమైంది. రాజకీయాల్లో పాత విధేయతలు, గత చరిత్ర కేవలం ఒక ఆరంభం మాత్రమే అవుతాయి తప్ప, వాటినే శాశ్వత విజయాలకు గ్యారెంటీగా తీసుకోలేము. కార్యకర్తల్లో నెలకొన్న అసంతృప్తిని తొలగించడం, క్షేత్రస్థాయిలో బలహీనపడిన పార్టీ యంత్రాంగాన్ని పునర్నిర్మించడం, ఒకేసారి బీజేపీ, కాంగ్రెస్ వంటి రెండు బలమైన ప్రత్యర్థులను సమర్థవంతంగా ఎదుర్కోవడం కేటీఆర్ ముందున్న తక్షణ కర్తవ్యాలు. గత పాలనా విజయాలను చెప్పుకోవడంతో పాటు, ప్రజల ప్రస్తుత సమస్యలపై పోరాడుతూ క్షేత్రస్థాయిలో తమ ఉనికిని బలంగా చాటుకున్నప్పుడే ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ మళ్లీ పుంజుకునే అవకాశం ఉంటుంది. ఈ నెల రోజుల కార్యాచరణ గులాబీ దళానికి నిజమైన అగ్నిపరీక్షగా మారనుంది.